ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
7
గురువారం 25 సెప్టెంబరు 2025





● సిద్ధమైన సభా ప్రాంగణం

సీఆర్‌డీఏ భవనం రెడీ!



రాజధానిలో తొలి శాశ్వత భవనంగా రికార్డు

విజయదశమికి ప్రారంభం?

కార్పొరేట్ కార్యాలయాలను తలదన్నేలా ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనం అత్యద్భుతంగా రూపు దిద్దుకుంది. రాజధాని అమరావతిలో తొలి శాశ్వత భవనంగా చరిత్ర కెక్కనుంది. ఇంటీరియర్ పనులను పూర్తి చేసుకున్న ఈ భవనం ఆరుబయటి మెరుగులను మాత్రమే అద్దుకోవాల్సి ఉంది. ఈ పనులన వారం రోజుల్లో పూర్తిచేసి విజయదశమికి ప్రారంభించేందుకు సీఆర్‌డీఏ సన్నద్ధమవుతోంది.

స్పెషల్ ఎట్రాక్షన్‌గా టెర్రస్

భవనం టెర్రస్ మీద మూడు రకాల ప్రత్యేక లేయర్స్‌తో కూడిన రూఫ్‌ను చాలా పటిష్టంగా ఏర్పాటు చేశారు. కాంక్రీటు శ్లాబ్‌పై ప్రైమర్, పాలి యూరియా, 270ఏ కెమికల్ (జియో టెక్స్‌టైల్ క్లాత్) వేసి దానిపైన మూడంగుళాల ఎత్తులో మళ్లీ స్క్రేడ్ కాంక్రీట్ వేసి, టైల్స్ అతికించారు. టెర్రస్‌లో ఫుడ్ కోర్టు, జిమ్, రెండు వాష్ రూంలు, మెడిటేషన్ సెంటర్, సోలార్ విద్యుత్ కోసం ప్రత్యేక ప్యానల్స్ ఏర్పాటు చేశారు.

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

రాయపూడి సమీపాన ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు ముందు వైపు.. సీడ్ యాక్సిస్ రోడ్డుకు దక్షిణంగా సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఆగస్టు 15 న ఈ భవనాన్ని ప్రారంభించాలని అనుకున్నప్పటికీ.. పనులు పూర్తికాకపోవడంతో అది సాధ్యం కాలేదు. రూ.240 కోట్ల వ్యయంతో జీ+7గా నిర్మిస్తున్నారు. కొద్ది నెలల కిందటే సివిల్ పనులన్నీ పూర్తయినప్పటికీ... ఇంటీరియర్, ఎలివేషన్ వర్కులకు సమయం పడుతూ వచ్చింది. ప్రస్తుతానికి 98 శాతం పనులు పూర్తయినట్టు భావించాలి.

జాప్యంతో పెరిగిన ఖర్చు!

రాజధాని నిర్మాణ బాధ్యతల్లో సింహ భాగాన్ని సీఆర్‌డీఏ తలకెత్తుకుంది. ఆ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు అమరావతిలోనే తన శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేసుకోవాలని

(మిగతా 10వ పేజీలో)



సార్లు.. సంబరం

● వెలగపూడి సచివాలయం వద్ద డీఎస్సీ సభ
● హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



అధికారులకు ఆదేశాలిస్తున్న ఐజీ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్

పటిష్ఠ బందోబస్తు : ఐజీ

డీఎస్సీ సభకు పటిష్ఠంగా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి తెలిపారు. అధికారులకు బందోబస్తు నిర్వహణ గురించి ఐజీ తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లో దిశానిర్దేశం చేశారు. వీవీఐపీ, వీఐపీ, డీఎస్సీ అభ్యర్థులకు కేటాయించిన మార్గాల్లో వారిని అనుమతించాలని చెప్పారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్త వహించాలన్నారు. వేదిక వద్ద విధులు నిర్వహించే వారు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఏఎస్పీలు రమణమూర్తి, రవికుమార్, సుప్రజ, హనుమంతు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నియామకపత్రాల పంపిణీ

● వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన అభ్యర్థులు
● గుంటూరు, నరసరావుపేటలోని కేంద్రాల్లో బస ఏర్పాటు
● గుర్తింపు కార్డులు పంపిణీ చేసిన విద్యాశాఖ అధికారులు

తుళ్లూరు (వెలగపూడి), నరసరావుపేట, గుంటూరు(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ఉత్సాహంగా ఉండగా వారిని మరింత సంతోష పరుస్తూ నియామకపత్రాల పంపిణీకి ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేసింది. గురువారం రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి సచివాలయ సమీపంలో డీఎస్సీ సభకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేయనున్నారు. ఇందుకు సంబంధించిన కార్యక్రమం, బహిరంగ సభకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. కాగా ముఖ్యమంత్రి నుంచి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకునేందుకు మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు వివిధ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో గుంటూరు, నరసరావుపేట తదితర ప్రాంతాలకు తరలి వచ్చారు. ఎక్కడికక్కడ విద్యాశాఖ అధికారులు వారి బసతో పాటు డీఎస్సీ సభకు సంబంధించి గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఉపాధ్యాయ అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను వెలగపూడికి తరలించేందుకు 71 బస్సులు ఏర్పాటు చేశారు. గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఆంధ్రా ముస్లిం కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో జోన్-3 (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) పరిధిలో ఎంపికైన అభ్యర్థులకు బుధవారం గుర్తింపు కార్డులు అందజేసినట్లు డీఈవో రేణుక తెలిపారు. కాగా ఇక్కడి నుంచి డీఎస్సీ అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులతో కూడిన బస్సులు గురువారం ఉదయం 7 గంటలకు బయలుదేరతాయన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైన గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. ఇక్కడ ఏర్పాట్లను ప్రత్యేక

(మిగతా 10వ పేజీలో)



గుంటూరులోని ఆంధ్రా ముస్లిం కళాశాలలో డీఎస్సీ అభ్యర్థులు

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు

● అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
● అనారోగ్య లక్షణాలు కనిపిస్తే బాధితులను శిబిరాలకు తరలించాలి
● అధికారులను ఆదేశించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా ముందస్తు జాగ్రత్త చర్యలు పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. సీజనల్ వ్యాధులు నియంత్రణపై వైద్య ఆరోగ్య, మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ, డయేరియా ప్రభావిత ప్రాంతాల్లోని ప్రత్యేక అధికారులతో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాతగుంటూరులో కేసులు నమోదవుతున్న తొమ్మిది సమస్యాత్మక ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకుని, అనారోగ్య లక్షణాలు ఉన్నవారిని వెంటనే వైద్య శిబిరాలకు తరలించి చికిత్స అందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గురువారం ఉదయానికి ఇంటింటి సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని మున్సిపల్ అధికారులు నిరంతరం పరీక్షించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులకు మున్సిపల్ సిబ్బంది అవసరం మేరకు సహకారం అందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలకు ప్రత్యేక అధికారులుగా నియమించిన జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలన్నారు.

202 డయేరియా కేసులు

డయేరియా ప్రాంతాల్లో 3,202 గృహాల సర్వే

నగరంలో అతిసార ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటి వరకు 202 మంది బాధితులను గుర్తించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. బాలాజీనగర్, నెహ్రూనగర్, రామిరెడ్డి తోట, యాదవబజార్, సీతారాంనగర్, ప్రగతినగర్, సంపత్ నగర్‌లలో 50 వైద్య బృందాలు 3202 గృహాలను సర్వే చేసినట్లు తెలిపారు. అతిసార బాధితుల గుర్తింపుతో పాటు అవగాన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 11 మంది అతిసార లక్షణాలు గల వారిని, నలుగుర జ్వర బాధితులను గుర్తించి ఆస్పత్రికి తరలించామన్నారు. జీజీహెచ్‌లో 17వ తేదీ నుంచి ఇప్పటి వరకూ 185 కేసులు నమోదు కాగా, 104 మంది చికిత్స పొందుతున్నారని, 81 మంది డిశ్చార్జి అయ్యారన్నారు. మంగళ, బుధవారాల్లో 17 కేసులు వచ్చాయని తెలిపారు. 168 నమూనాలు సేకరించగా 13 పాజిటివ్ వచ్చాయని, వాటిలో విబ్రియో 3, షిగెల్లీ 1, ఈ.కొలి 9 కేసులు ఉన్నాయన్నారు. 163 తాగునీటి నమూనాలు పరీక్షల కోసం సేకరించినట్లు తెలిపారు.

అతిసార బాధితులకు మెడికల్ కిట్లు

గుంటూరు మెడికల్: డయేరియాపై ప్రజలు అపోహలకు గురికావద్దని కలెక్టర్ అన్సారియా కోరారు. బుధవారం మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ ప్రగతినగర్‌లో పర్యటించి బాధితులకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ప్రథమ చికిత్సలకు ఏర్పాటు చేసిన మొబైల్ మెడికల్ వ్యాన్‌ను పరిశీలించారు. యాదవబజార్‌లోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్యం నిలకడగా ఉందని కలెక్టర్ తెలిపారు. మరో 15 రోజులపాటు వైద్య శిబిరాలను కొనసాగించాలని కలెక్టర్‌ని మేయర్ కోరారు.

ఫలితాలు వచ్చాక చర్యలు

డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో బోర్ వేల్స్ ఆర్‌వో ప్లాంట్ల నీటిని పరీక్షల కోసం ల్యాబ్‌లకు పంపామని, నివేదికలు అందినతర్వాత చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. డ్రెయిన్‌లో ఉన్న తాగునీటి పైప్‌లైన్లను మారుస్తున్నట్లు తెలిపారు.



వృద్ధురాలికి మెడికల్ కిట్ అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా

ఆయా కార్యక్రమాల్లో డీఆర్వో ఖాజావలి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశశ్వి, డీపీవో సాయికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కళ్యాణ్ చక్రవర్తి, నగరపాలక సంస్థ సీఎంహెచ్‌వో శోభారాణి, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఎస్ఈ సుందర రామిరెడ్డి, ప్రత్యేక అధికారులుగా నియమించిన మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డి, ఉద్యాన, గిరిజన శాఖ, స్త్రీ శిశు సంక్షేమ, విద్యాశాఖల అధికారులు రవీంద్రబాబు, మురళి, ప్రసూన,రేణుక తదిరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

వరదపై అప్రమత్తంగా ఉండాలి

● వాగుల ప్రవాహానికి అడ్డంకులను తొలగించాలి
● ఏడీసీ ఇంజనీర్లను ఆదేశించిన సీఎండీ లక్ష్మీపార్థసారథి

తుళ్లూరు సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద వస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఛైర్‌పర్సన్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీ పార్థసారథి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఎన్-6 రోడ్డుపై అమృత విశ్వవిద్యాలయం వద్ద కొండవీటి వాగు నీటి ప్రవాహాన్ని ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. నీరుకొండ నుంచి వస్తున్న నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని సీఈలు ఆర్.గోపాలకృష్ణారెడ్డి, బి.నరసింహమూర్తి, సీహెచ్.ధనుంజయలను ఆదేశించారు. విజయవాడ బైపాస్‌లో ఈ-10, ఈ-11, ఈ-12 రహదార్ల వద్ద వాగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున ఎక్కడా అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. కొండవీటివాగు నీటి ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పర్యటనలో ఈఈ కె.బసవేశ్వరరావు, ఎంవీఆర్ ఇన్‌ఫ్రా ప్రతినిధులు ఉన్నారు.



అమరావతిలో వాగుల ప్రవాహంపై అధికారులతో చర్చిస్తున్న ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి

మత్తు మందు ఇచ్చి ఆభరణాల దోపిడీ

జీజీహెచ్‌లో ఓ మహిళను అరెస్టు చేసిన పోలీసులు

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోగుల సహాయకులకు టీలో మత్తుబిళ్లలు కలిపి ఇచ్చి వారు అపస్మారకస్థితిలోకి వెళ్లగానే వారి వంటిపై బంగారు ఆభరణాలు దోచుకుంటున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. జీజీహెచ్‌లో ఎంతోకాలంగా ఈ తరహా దోపిడీలకు పేరేచర్లకు చెందిన దీనమ్మ అనే మహిళ పాల్పడుతున్నట్లు గుర్తించి ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో నిందితురాలిని మీడియా ఎదుట హాజరుపరిచి ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్యచౌదరి వివరాలు వెల్లడించారు. దీనమ్మ అనారోగ్యంతో ఉన్న కుమారుడికి జీజీహెచ్‌లో చికిత్స చేయిస్తున్నది. ఈ నెల 15న రాత్రి గురజాల మండలానికి చెందిన లక్ష్మీబాయి క్యాంటీన్ వద్ద ఉండగా దీనమ్మ ఆమెకు టీలో మత్తు బిళ్లలు కలిపి ఇచ్చింది. దీంతో లక్ష్మీబాయి అపస్మారక స్థితికి చేరుకోగా ఆమె మెడలోని బంగారపు గొలుసు తెంచుకుని ఉడాయించింది. ఇదే తరహాలో ఈ నెల 18న నగరంలోని ఆర్టీసీకాలనీ రాహుల్‌గాంధీనగర్‌కు చెందిన నరసమ్మ మెడలోని నాన్‌తాడు తెంచుకుని పారిపోయింది. ఈ ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో నేరాలకు పాల్పడింది దీనమ్మగా పోలీసులు గుర్తించి ఆమెను అదుపులో తీసుకుని ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించిన కొత్తపేట సీఐ వీరయ్యచౌదరి, క్రైం టీం సభ్యులు డీ కోటేశ్వరరావు, షేక్ జానీ బాషా, సీహెచ్ శ్రీనివాసరావు, టీ అనిల్ తదితరులను డీఎస్పీ అభినందించారు.



వివరాల వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్యచౌదరి


వరదపై.. అప్రమత్తం

● ఎగువ నుంచి 4.50 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ● సమాచారం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం 0863 2234014

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి ఎగువ నుంచి 4.50 లక్షల క్యూసెక్కుల వరకు వరదనీరు వస్తోంది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రకాశం బ్యారేజ్ ఎగువ, దిగువ మండలా లైన తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లి పర ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనీయకుండా చూడాలన్నారు. పశువులను కూడా నీటి ప్రవాహాల వద్దకు తీసుకెళ్లొద్దని సూచించారు. ఏదైనా అవాంఛనీయ సం ఘటన జరిగితే వెంటనే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంలోని 08632 234014 నెంబర్‌కి సమాచారం అందించాలన్నారు.

సాగర్‌లో 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్టు అధికారులు బుధవారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. కాగా, సాగర్ జలాశయ నీటిమట్టం ప్రస్తుతం 586.60 అడుగులుగా ఉంది. ఇది 303.43 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,019 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 2,765 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,886 క్యూసెక్కులు, క్రస్ట్‌గేట్ల ద్వారా 3,20,046 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తంగా ఔట్‌ఫ్లోగా 3,66,816 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 3,66,816 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

టెయిల్‌పాండ్ నుంచి 3,64,746 క్యూసెక్కుల నీటి విడుదల

రెంటచింతల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 3,64,746 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, గిరిబాబు తెలిపారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 3,52,810 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని చెప్పారు. రిజర్వాయర్‌లో 74.48 మీటర్ల మేర నీరుండగా ఇది 6.5910 టీఎంసీలకు సమానమన్నారు. భారీగా వరద నీరు వస్తుండడంతో విద్యుదుత్పత్తిని నిలిపి వేసినట్లు చెప్పారు.



16 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 34.67 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 3,68,435 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, 12 గేట్ల ద్వారా 3,65,670 క్యూసెక్కులు, మొత్తం 3,82,670 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 453 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,000, గరిష్ఠ ధర రూ.10,560, మోడల్ ధర రూ.10,560 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,025, గరిష్ఠ ధర రూ.10,200, మోడల్ ధర రూ.10,200 పలికాయి.

పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కు నీటిని బుధవారం విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.9 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 4,38,288 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 1,513 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 415 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 237 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 423 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2,140 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద భారీగా వరద ఉధృతి

● కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని భారీగా విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన వున్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 4 లక్షల 55 వేల 693 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతుంది. వరద ఉధృతి 4 లక్షల క్యూసెక్కులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4 లక్షల 43 వేల 808 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 7,372 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రకాశం బ్యారేజికి వరద ఉధృతి భారీగా పెరుగుతుండడంతో దిగువ నదీతీర ప్రాంతాల వాసులు, లంకభూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు



కొనసాగుతున్న జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన మూడో రౌండ్ పోటీలలో సంచలన ఫలితాలు నమోదయ్యాయి. తమిళనాడుకు చెందిన టాప్ సీడ్ పీ. ఇనియన్‌తో జరిగిన ఆటను మహారాష్ట్ర ఆటగాడు దిలీప్ భోయిర్ డ్రాగా ముగించగా.. రైల్వే ఆటగాడు జీఎం నయంతన్ దాసును 12 ఏళ్ల ఆంధ్ర ఆటగాడు అందమాల హేమల్ వర్షన్ ఓడించి సంచలనం సృష్టించాడు. మూడో రౌండ్ ముగిసే సరికి 27 మంది ఆటగాళ్లు చెరో మూడు పాయింట్లతో ఉన్నారని ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి కే జగదీష్ వెల్లడించారు.

బస్టాండ్‌లో సొమ్మసిల్లి పడిపోయిన కండక్టర్

● సకాలంలో వైద్యం అందించడంతో తప్పిన ప్రమాదం

వినుకొండటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ ఓ కండక్టర్ సొమ్మసిల్లి పడిపోయారు. అధికారులు, తోటి సిబ్బంది సకాలంలో స్పందించి ఆయనకు వైద్యం అందించడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. వినుకొండ బస్టాండ్‌లో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వీరయ్య నైట్ ఔట్ ఒంగోలు డ్యూటీ చేసి మరుసటి రోజు ఉదయం దొండపాడు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే కంట్రోల్ పాయింట్ వద్ద సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే యూనియన్ నాయకుల సాయంతో ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో కోలుకున్నారు. వీరయ్య గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుండడాన్ని గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు.

బీసీల సమస్యలపై సమరశీల పోరాటాలు: కేసన శంకరరావు

మంగళగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో బుధవారం బాపట్ల జిల్లాకు చెందిన పలువురు నేతలు బీసీ సంక్షేమ సంఘంలో చేరారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ, బీసీ వర్గాల ప్రజలను ఐక్యం చేసి వారి అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి ఎన్నో విజయాలను సాధించామని గుర్తుచే శారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని, చట్టసభలు, స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సం క్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, యువజన విభా గం అధ్యక్షుడు పారేపల్లి మహేశ్, బాపట్ల జిల్లా అధ్యక్షుడు పచ్చబట్ల గంగరాజు, నేతలు తిరువీధుల కిరణ్, ధనుంజయ్, పీ.శివకుమార్, విన్నకోట జగదీశ్, గోసాల శ్రీను, చెన్ను పోతురాజు, పులిమి జానకిరామయ్య, జగ్గారపు పాపారావు తదితరులు పాల్గొన్నారు.



నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేసిన కేసన శంకరరావు

పోలీసుల అదుపులో ద్విచక్ర వాహన దొంగలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసలుగా మారిన నలుగురు యువకులు బైకు చోరీలకు పాల్పడుతూ పోలీసుల చేతికి చిక్కారు. తుళ్లూరు గ్రామానికి చెందిన లేళ్ల పవన్ తేజ, తేజావత్ ప్రకాశ్, పెడల అంకమ్మరాజు, ఉద్దండరాయునిపాలెం గ్రామానికి చెందిన రౌడీషీటర్ ఇసుకపల్లి కీర్తి రాజు, మరో ముగ్గురు బాలురను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప వన్ తేజ, ప్రకాశ్, ఇద్దరు మైనర్ బాలురు కలిసి ద్విచక్ర వాహ నాలను దొంగిలించి, నెంబర్ ప్లేట్లు మార్చి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆత్మకూరు, నవులూరు, నిడమర్రు, చినకాకాని, ఎర్రబాలెం గ్రామాల్లో లాక్ చేసి ఉన్న పది మోటారు సైకిళ్లను చోరీ చేశారు. వీరి వద్ద నుంచి అంకమ్మరాజు, కీర్తిరాజు, మరో బాలుడు బైకులను కొనుగోలు చేశారు. నవులూరు గ్రామానికి చెందిన మర్రి దుర్గానాగమల్లేశ్వరరావుతోపాటు మరో అరుగురు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు బైకులు చోరీ చేసిన నిందితులతోపాటు కొనుగోలు చేసి వారిని కూడా అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి పది బైకులను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్సై సీహెచ్ వెంకట్, హెడ్ కానిస్టేబుల్ అంకమ్మరావు, ఏఎస్సై రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట్

పీ-ఫోర్‌లో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలి

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడెల శివరాం

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ-ఫోర్ కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడెల శివరాం కోరారు. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో డలాస్ నగరంలో ఆయన పర్యటించి, మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత కోడెల శివప్రసాద్, ఎన్టీఆర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, చంద్రబాబునాయుడి సమర్థ పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా పయనిస్తోందని అన్నారు. ఇటువంటి సమయంలో రాష్ట్రాభివృద్ధికి ప్రవాసాంధ్రులు ముందుకు రావాలని కోడెల శివరాం కోరారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ, టీడీపీ బలోపేతానికి కోడెల శివప్రసాద్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా బసవతారకం ఇండో క్యాన్సర్ ఆస్పత్రి అభివృద్ధిలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దర్శి జనసేన ఇంచార్జి గరికపాటి వెంకట్, ఎన్నారై టీడీపీ డలాస్ సభ్యులు వీరు, ధూళిపాళ్ల కృష్ణ, వెంకట్, మాధవరావు, హరేంద్ర, ఉడత శ్రీనివాస్, గాలి నాగేశ్వరావు, కిరణ్ పోతురాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్, కోడెల శివప్రసాద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కోడెల శివరాం, ప్రవాసాంధ్రులు

దసరా బోనస్‌పై రైల్వే ఉద్యోగుల అసంతృప్తి

● పదేళ్లుగా రూ.7 వేల సీలింగ్‌కు పరిమితం ● దీనివల్ల ఒక్కో ఉద్యోగికి రూ. 17,591

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏటా రైల్వేలో నాన్ గజిటెడ్ ర్యాంకు ఉద్యోగులకు దసర పండగకు ముందు కేంద్రప్రభుత్వం ఇచ్చే ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్ (పీఎల్‌బీ)ని ఈ సంవత్సరం కూడా పెంచకపోవడంపై గుంటూరు రైల్వే డివిజన్ వ్యాప్తంగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో దాదాపుగా 4,600 మందికి పైగా నాన్ గజిటెడ్ ర్యాంకు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్యాసింజర్ టిక్కెట్స్, సరుకు రవాణ, క్యాటరింగ్ కాంట్రాక్టు వంటి వాటి ద్వారా గత సంవత్సరం కంటే ఆదాయం 10 నుంచి 15 శాతానికి పైగా పెరిగింది. ఇతర డివిజన్లలోనూ ఆదాయం ఆశాజనకంగా ఉండటంతో కచ్చి తంగా కేంద్రప్రభుత్వం ఈ సంవత్సరం పీఎల్‌బీని పెంచుతుందని ఉద్యోగులు ఆశలు పెట్టుకు న్నారు. గత పదేళ్ల నుంచి నెలకు రూ. 7 వేలు సీలింగ్ పెట్టి 78 రోజులకు లెక్కించి రైల్వేశాఖ చెల్లిస్తోంది. పండగ మరో వారం రోజులు ఉందనగా ఇప్పటికే రైల్వే మంత్రిత్వశాఖ నుంచి బోనస్ నగదు విడుదలైంది. ఈ మొత్తాన్ని రెండు, మూడు రోజుల్లోనే ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే దీనిపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాము ఏడాది పొడవునా శ్రమిస్తూ రైల్వేకు ఆదాయం పెంచుతున్నా బోనస్ మాత్రం పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి కాలరీస్ వంటి బొగ్గు గనుల సంస్థలో దసరా పండగ సందర్భంగా ఒక్కో ఉద్యోగికి రూ.1.25 లక్షలకుపైగా బోనస్ వస్తోందని, రైల్వేలో రూ. 17,951కి మించడం లేదని వాపోయారు. దీర్ఘకాలంగా తాము నెలకు బోనస్ సీలింగ్‌ని రూ. 14 వేలకు పెంచమని కోరుతున్నా రైల్వే శాఖ ఎప్పటికప్పుడు దాట వేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నెలకు బోనస్ సీలింగ్‌ని రూ.14 వేలు చేయాలి : రమణయ్య, ఎస్‌సీఆర్ఈఎస్ డివిజనల్ సెక్రెటరి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన దసరా బోనస్ మాకు ఏ మాత్రం సమ్మతం కాదు. ఎన్నో ఏళ్లుగా బోనస్ పెంచాలని మేము పోరాడుతున్నాం. పదేళ్ల క్రితం నిత్యావసర, గృహోపకరణాల ధరలు, పిల్లల ఫీజులు ఎంత ఉన్నాయి, ఇప్పుడెంత ఉన్నాయి. ఇవేమి పరిగణనలోకి తీసుకోకుండా రైల్వేశాఖ పాత బోనస్‌నే మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం రైల్వే ఉద్యోగులకిచ్చే బోనస్ సీలింగ్‌ని నెలకు రూ.14 వేలు చేయాలి.

టిడ్కో గృహాలపై దృష్టి సారించాలి

● అసెంబ్లీలో ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రూ. కోట్ల వ్యయంతో నిర్మించిన టిడ్కో గృహాలు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో కోరారు. గతంలో నిర్మించిన గృహాలనే లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోకుంటే, ఇప్పు డు నిర్మించేవి ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడతాయో ఆలోచించాలని సూచించారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాలు నేటికీ నిరుపయోగంగా ఉన్నాయని, అన్ని సౌకర్యాలు కల్పించినా లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండటానికి విముఖత చూపుతున్నారని చెప్పారు. గృహాలలో చేరనివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటే తప్ప ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా లేదన్నారు. నివాస సముదాయాల చుట్టూ రక్షణ కోసం ప్రహరీలు, సమీపంలో శ్మశాన వాటికలు నిర్మించాలన్నారు.

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విఠంరాజుపల్లి బాలాజీ ఐటీఐ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నట్లు ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ తెలియజేశారు. ఈ నెల 30వ తేదీన జరగబోయే చివరి కౌన్సెలింగ్‌కు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు 10వ తరగతి మార్కుల లిస్టు, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు 9440542030, 8555867782 నంబర్లను సంప్రదించాలన్నారు.

27న వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు

● ఆరు రోజులపాటు 18 నాటికల ప్రదర్శన

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు శనివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రారంభం కానున్నాయి. ఆరు రోజుల పాటు జరిగే ఈ నాటకోత్సవాలలో 18 నాటికలను ప్రదర్శించనున్నారు. 27న వెంకటేశ్వర మహత్యం, కాలభైరవ సంహారం, నల్లతాచు నీడలో, 28న కస్తూరి తిలకం, బ్రహ్మరథం, యాగం, భువికోరని భ్రమణం, 29న పుత్రాదిచ్ఛేత్, అయోధ్య రామయ్య, ఇది ప్రమాదానికి సాంకేతం, నేటి కబంద హస్తం 30న మోహిని భస్మాసుర, జగదేక సుందరి సామా, అంతా మంచివారే కానీ, క్రతువు, అక్టోబరు 1న ఆదికవి నన్నయ్య బట్టు, సిరికేళి, నాన్న, ఎక్కడో ఏదో, దీపం కింద చీకటి, 2వ తేదీన మమ్మల్ని బతకనివ్వండి నాటికలను ప్రదర్శించనున్నారు.

నలుగురికి పురస్కారాలు

నాటకోత్సవాలలో నలుగురు రంగస్థల ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. రంగస్థల నిర్వాహకులు, గుణ నిర్ణేత, సర్రాజు బాలచంద్రరావుకు ఎ.ఆర్.కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారం, రంగస్థల నటుడు, దర్శకుడు నూతనపాటి సాంబయ్యకు వేదగంగోత్రి వరప్రసాద్ రంగస్థల పురస్కారం, పౌరాణిక నటుడు, దర్శకుడు షేక్ సైదులుకు బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి రంగస్థల పురస్కారం, రంగస్థల నటుడు, రచయిత అయినాల మల్లేశ్వరరావుకు విరించి బిరుదు ప్రదానం చేయనున్నారు. అవార్డ్స్ కమిటీ కళల కాణాచి అధ్యక్షుడు, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, కమిటీ సభ్యులు నాటకోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బావను చంపిన బావ మరిది

సత్తెనపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో బావను కత్తితో పొడిచి బావమరిది హత్య చేశాడు. ఈ ఘటన సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో బుధవారం జరిగింది. సత్తెనపల్లికి చెందిన షేక్ మస్తాన్ అదే పట్టణానికి చెందిన కరీం చెల్లెలిని ఆరు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇటీవల మస్తాన్ తన భార్యకు పెద్ద మనుషుల సమక్షంలో విడా కులిచ్చాడు. బుధవారం మస్తాన్ రైల్వే స్టేషన్‌లోని ఓ టీస్టాల్‌లో టీ తాగుతుండగా బావ మరిది కరీం కొబ్బరి బోండాలు నరికే కత్తి తీసుకొచ్చి అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచాడు. వెంటనే మస్తాన్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మస్తాన్ ను హత్య చేసిన అనంతరం కరీం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. డీ ఎస్పీ హనుమంతరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ మస్తాన్ (ఫైల్‌ఫొటో)

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

పెదనందిపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెదనందిపాడు మండలం జీజీపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి కాండ్రు నితిన్ (20) బుధవారం ఈతకు వెళ్లి మృతి చెందాడు. రావిపాడు వద్ద ఉన్న మల్లాయపాలెం మేజర్ కాలువలో నితిన్ కాలు జారిపడి మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుడు పెదనందిపాడు పీఏఎస్ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నట్లు బంధువులు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

31,926 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 33,605 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 31,926 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,473 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14300
నెంబరు. 5	10000	14000
273	----	----
341	10000	15000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14500
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	14800
దేవనూరు డీలక్స్	10000	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9800	12000
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14500
నెంబరు. 5	10000	14200
273	----	----
341	10000	15200
4884	10000	13500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14700
బ్యాడిగి	10000	14900
దేవనూరు డీలక్స్	10500	14000
తాలుకాయలు	5000	7000

డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు


జీఎన్‌టీ రోడ్డులో యంత్రాలతో డ్రెయిన్లపై ఆక్రమణల తొలగిస్తున్న సిబ్బంది

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షం వస్తే డ్రెయిన్లలో నీరంతా ఉప్పొంగుతూ వాహనదారులను ఇబ్బంది పెడుతున్న జీఎన్‌టీ రోడ్డులో నగర పాలకసంస్థ ఆక్రమణల తొలగింపు చేపట్టింది. రెండు రోజుల నుంచి హిందూ కళాశాల వెనక పెట్రోలు బంక్ నుంచి జేసీబీ, ఎక్స్‌కవేటర్ యంత్రాల ద్వారా డ్రెయిన్లపై శాశ్వతంగా నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ శ్లాబులను తొలగిస్తోన్నది. ఈ విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రభుత్వ, కార్పొరేట్ కార్యాలయాలు అన్న తేడా చూపించకుండా డ్రెయిన్‌పై నిర్మించిన శ్లాబులను తొలగిస్తున్నారు. టుబాకో బోర్డు వరకు దాదాపుగా తొలగింపు ప్రక్రియ పూర్తయింది. పక్కనే పీకలవాగు ఉన్న దృష్ట్యా జీఎన్‌టీ రోడ్డు డ్రెయిన్‌లోని వరదనీరు అంతా ఎలాంటి అవరోధాలు లేకుండా అందులో కలిసేలా చర్యలు చేపట్టారు. కేవలం ఈ డ్రెయిన్‌ని క్లీనింగ్ చేయడానికి వీల్లేకుండా శ్లాబులు నిర్మించడం వల్ల చెత్తా చెదారాలు, మురుగు పేరుకుపోయి పది నిమిషాల వర్షానికే వరదనీరు రోడ్డు పైకి వచ్చేస్తున్నది. దీంతో వాహనాల రాకపోకలు గంటల తరబడి స్తంభించిపో తున్నాయి. అంతేకాకుండా పక్కనే ఉన్న శ్రీనివాసరావుపేటలోని పలు వీధుల్లోకి డ్రెయినేజీ నీరు వచ్చి చేరుతున్నది. నగరపాలకసంస్థ ఎట్టకేలకు డ్రెయిన్‌పై ఉన్న వాటన్నింటిని తొలగించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనిని ఎప్పుడో చేసి ఉంటే డ్రెయినేజీ సమస్య వచ్చేదే కాదని చెబుతున్నారు.

ప్రతిరోజు తాగునీటి శాంపిల్స్ తీయాలి : కమిషనర్


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో విధులు కేటాయించ బడిన జిల్లా (నోడల్) అధికారులు ప్రతిరోజు తాగునీటి శాంపిల్స్ తీసి, ల్యాబ్‌కి పంపేలా పర్యవేక్షణ చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో నియంత్రణ చర్యల కోసం కలెక్టర్ విధులు కేటాయిం చిన నోడల్ అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నోడల్ అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, సచివాలయ కార్యదర్శులు చేపట్టిన డయేరియా అవగాహన కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించాలన్నారు. డయేరియా లక్షణాలతో మెడికల్ క్యాంప్‌కు వచ్చే వారు, వారిలో అక్కడే చికిత్స తీసుకునేవారు, జీజీహెచ్‌కి రిఫర్ చేయబడే వారి వివరాలను నివేదిక ఇవ్వాలన్నారు.

సాధారణ కార్యకర్తలకు బీజేపీలోనే న్యాయం

- రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనం శ్రీనివాస్

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాధారణ కార్యకర్తలకు భారతీయ జనతా పార్టీలోనే గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనం శ్రీనివాస్ అన్నారు. బుధవారం బీజేపీ గుంటూరు రూరల్ మండలం ఉత్తర విభాగం నాయకులు స్థానిక గోరంట్ల అన్నపూర్ణనగర్‌లో శ్రీనివాస్‌కు చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కంచర్ల రాజేష్, ప్రధానకార్యదర్శి నీలం సాంబశివరావు, ఆవుల రామకోటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలో ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్తు ఉంటుందనటానికి దర్శనం శ్రీనివాస్ నిదర్శనం అని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల ప్రధాన కార్య దర్శి తాళ్ల సుబ్బారావు, సీనియర్ నాయకులు అనుమలు ఏడుకొండలు గౌడ్, గొల్లపూడి గిరిభూషణరావు, మాదిరాజు తరుణ్‌కుమార్, కుర్ర నాగేశ్వరరావు హాజరయ్యారు.

కిట్స్ అక్షర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్‌డే

గుంటూరు(విద్య), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక యనమదలలోని కిట్స్ అక్షర్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు స్వాగతోత్సవ(ఫ్రెషర్స్‌డే) వేడుకలు బుధవారం నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్, గోగినేని సాంబశివరావు, ప్రిన్సిపాల్ రామకోటయ్య తదితరులు హాజరయ్యారు. ఛైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యతో పాటు ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇండస్ట్రీలకు కావాల్సిన నూతన నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

గుంటూరు(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సేవాభావం పెంపొందడా నికి జాతీయ సేవా పథకం దోహదం చేస్తుందని హైకోర్టు న్యాయవాది స్వదీప్తి తేరా అన్నారు. బుధవారం టీజేపీఎస్ కళాశాలలో జరిగిన జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాల్లో ఆమె మాట్లాడారు. చదువుతోపాటు సేవా భావాన్ని పెంపొందించుకుని సమాజానికి యువత సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కామేశ్వర శాస్త్రి, కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జేవీ సుధీర్‌కుమార్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

రేపు చిట్యాల ఐలమ్మ జయంతి సభ

గుంటూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ జయంతి సభను ఈనెల 26వ తేదీన చంద్రమౌళీనగర్‌లోని మాజేటి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ గౌరవాధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, అధ్యక్షుడు పర్చూరు సంజీవరావు, ఏపీ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావులు తెలిపారు. బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో పోస్టర్లను విడుదల చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆధ్వర్యంలో జరిగే ఐలమ్మ జయంతిసభకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్‌ల ఛైర్మన్‌లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఇంకొల్లు భగత్, తుమ్మేటి మురళీ, కరణం, వేంపటి సాయి తదితరులున్నారు.

టెండర్ రెన్యువల్‌పై అక్రమాలను విచారించాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): టెండర్ రెన్యువల్ పేరు తో స్థానిక పంచాయతీ కార్యదర్శులు ప్రతి కార్మికుడి నుంచి రెండు నుంచి మూడు వేల రూపాయలు వరకు వసూలు చేస్తున్నారని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాసరావు ఆరోపించారు. వసూళ్లపై విచారణ జరిపించాలని కోరుతూ బుధవారం డీపీవో నాగసాయికు మార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం చింతల శ్రీనివాసరావు మాట్లా డుతూ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి కావాల్సిన టెండర్ ప్రక్రియ చాలా పంచా యతీల్లో పూర్తి కాలేదన్నారు. దీంతో కార్మికులు జీతాలు పెంచుకునే అవకాశం కోల్పోతున్నారని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నూతక్కి వీరయ్య, ఎన్ రత్నకుమారి, అంజమ్మ, మేనక రావు, రమణమ్మ, నరసింహారావు తదితరులు ఉన్నారు.

జగన్మాతకు.. జన నీరాజనం

- వైభవంగా దేవి నవరాత్రులు
- కనువిందు చేస్తున్న అమ్మవారి రూపాలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో శ్రీదేవి శరవన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజున బుధవారం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. గోపూజ, సువాసిని, కుమారి పూజలు సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవా లయాల్లో అమ్మవారిని అన్నపూర్ణదేవి, గాయత్రీదేవి, భవానీదేవిగా అలం కరించారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. దేవాలయాల్లో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.


బృందావన్‌గార్డెన్స్, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీభవానిదేవిగా అమ్మవారు

● గుంటూరు: నగరంలోని ఏటుకూరు రోడ్డులోనున్న శ్రీకన్యకా పర మేశ్వరి ఆలయంలో అమ్మవారు బుధవారం శ్రీచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శ నమిచ్చారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ కోట శేషగిరిరావు, గౌరవ సలహాదారు కొనకళ్ళ సత్యం, ఆలయ ఈవో ఎన్ శ్రీనివాసరావులు భక్తులకు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. పొన్నూరు రోడ్డు సంగడిగుంటలోని శ్రీకనకదుర్గమ్మ దేవస్థా నంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. చుట్టుగుంట శ్రీ పోలేరమ్మ దేవస్థానంలో అన్నపూర్ణదేవిగా అమ్మవారిని భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రులకు ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు.


శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీచండీదేవి అలంకరణలో అమ్మవారు

● పొన్నూరు రోడ్డు సంగడిగుంట వద్దనున్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో సామూహిక కుంకుమపూజలు జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ముత్తయిదువులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

సంగడిగుంట శ్రీ కనకదుర్గమ్మ తల్లికి 108 వంటకాలు


అమ్మవారికి సమర్పించిన 108 వంటకాలు

గుంటూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పొన్నూరు రోడ్డు సంగడిగుంటలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మకి అన్నపూర్ణదేవి అలంకరణను పురస్కరించు కొని భక్తులు 108 రకాల వంట కాలు తయారు చేశారు. ఆలయంలో అమ్మవారికి ఆయా వంటకాలను నైవేద్యంగా సమర్పించటం విశేషం. అలానే లాంచస్టర్ రోడ్డులోనున్న భక్తులు మేళతాళాలతో అమ్మ వారికి చీర, సారె సమర్పించారు. కార్యక్రమంలో కందిమళ్ళ సాంబశివరావు, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మోరబోయిన నరసింహారావు, మల్లం సత్య నారాయణరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల, శ్రీ వెం కటేశ్వర స్వామి దేవస్థానంలో (పెద్దగుడి) బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. మహిళలు కోలాటం, చెక్కభజన, భరతనాట్యం, కూచిపూడి, జానపద గేయాల మధ్య బతుకమ్మ ఆటలు ఆడుతూ వేడుకగా నిర్వహిం చారు. పూజల్లో వేద సీడ్స్ అధినేత తులసీ ధర్మచరణ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ అధ్య క్షుడు ఎర్రంశెట్టి వేణుగోపాల్, ఛైర్మన్ కంచర్ల ఆంజనేయులు, శివన్నారాయణ, గోలి ధనలక్ష్మి, వడ్లమూడి రత్న, శాంతి తదితరులు పాల్గొన్నారు.


సంబరాల్లో పాల్గొన్న తులసీ ధర్మచరణ్, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు

కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సీఈవోపై చర్యలు తీసుకోరా?

- సిరిపురపు శ్రీధర్

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు అడ్డాగా మారిన బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సీఈవో నాగసాయిపై ఈ కూటమి ప్రభుత్వంలోని అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని బ్రాహ్మణ చైతన్య వేదిక కన్వీనర్ సిరిపురపు శ్రీధర్ శర్మ ప్రశ్నించారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు ఈ సొసైటీ ఏర్పాటు చేస్తే దానికి చెడ్డ పేరు తెస్తున్నారని బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి చేసే వారిపై విచారణ పారదర్శకంగా తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు.


శుద్ధపల్లి సుకుమార్‌ను సత్కరిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాదు

తేట తెలుగులో బైబిల్‌ని పద్యం చేసిన జాషువా

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): తేట తెలుగులో బైబిల్ ని క్రీస్తు చరిత్రగా పద్యం చేసిన గొప్పకవి గుర్రం జాషువా అని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కొనియాడారు. జాషువా జయంతి వారోత్సవాల సందర్భంగా బుధవా రం నగరంపాలెంలోని జాషువా విగ్రహం వద్ద గుర్రం జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో గుంటూరు, ఏపీపీ శుద్ధపల్లి సుకు మార్ అధ్యక్షతన క్రీస్తు చరిత్ర ఖండ కావ్యంపై సభ నిర్వహించారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ జాషువా సమాజంలోని అసమానతలపై ఆవేదనతో సృజించిన సాహిత్యం సమాజ మార్పుకు ఎంతో దోహదం చేసింద న్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు మాట్లాడుతూ జాషువా రచించిన క్రీస్తు చరిత్రకు కేంద్ర ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఏపీపీ శుద్ధపల్లి సుకుమార్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దేగల సీతా రామయ్య, అత్తోట జోసఫ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్స్ స్వీపర్ల వేతనాలను చెల్లించాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూల్స్ స్వీపర్లకు రావాల్సిన నాలుగు నెలల పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కూల్లో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న వర్కర్లకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.6వేలు జీతం కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచితే వీరి కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నిం చారు. ఇప్పటికైన ప్రభుత్వం చిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఘనంగా డైట్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుంటూరు(విద్య), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతబస్టాండు వద్ద ఉన్న పరీక్ష భవన్‌లో డైట్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు. డైట్ కళాశాలలో 1992-93 సంవత్సరాల్లో చదువుకున్న విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన తమ బ్యాచ్‌మేట్స్ పి.వీరబ్రహ్మం, జి.గంగయ్య తదితరుల్ని సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మన్నవ సురేష్‌కుమార్, పి.సురేష్, డానియేల్, చెరుకూరిశ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల్ని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

రైల్వేలో సఫాయి మిత్రలకు ఆటల పోటీలు

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవలో భాగంగా రైల్వేలో విధులు నిర్వహించే సఫాయి మిత్రలకు వివిధ రకాల ఆటల పోటీలను గుంటూరు డివిజ నల్ అధికారులు నిర్వహించారు. బుధవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో సఫా యి మిత్రలకు వాలీబాల్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, చదరంగం, క్యారమ్స్ వంటి పోటీలు నిర్వహించి వాళ్లలో ఉత్సాహాన్ని నింపారు. సఫాయి మిత్రలు ఐక్యంగా ఒక బృందం వలే పని చేసి రైల్వే ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేలా చేయడమే ఈ పోటీల లక్ష్యమని అధికారులు తెలిపారు.

నేడు వ్యాపారవర్గాలతో సమావేశం

గుంటూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల జీఎస్‌టీ శ్లాబు తగ్గింపు ధరలపై వ్యాపారవర్గాలతో వాణిజ్యపన్నులశాఖ, ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు చాంబర్ సభ్యులు తెలిపారు. వాణిజ్యపన్నులశాఖ గుం టూరు -1 డివిజన్ అధికారులతో కలిసి వ్యాపారవర్గాలకు సూచనలు, సలహాలతో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిరుద్యోగిని మోసగించిన కేసులో
రెండేళ్ల జైలు, రూ.15 వేలు జరిమానా

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు సృష్టించి, నిరుద్యోగిని మోసగించిన కేసులో ఒంగోలులోని ఎస్ఈ కార్యాలయంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పోలంరాజు వెంకట శివరామకృష్ణరాజు అలియాస్ శివరామకృష్ణ అనే నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ ఆరో అదనపు సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎండీ గౌస్ తీర్పు ఇచ్చారు. నకిలీ పత్రాలు తయారు చేసి వాటిని నిజమైనవిగా నమ్మించి, నిరుద్యోగిని ఇచ్చి మోసం చేసిన ఘటనకు సంబంధించి 2018 అక్టోబరు 29న మేకల రవికుమార్ అనే వ్యక్తి ఏపీ ఎస్‌పీడీసీఎల్‌లో 2017 సంవ త్సర ఉద్యోగ ప్రకటనలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఎంపికయ్యానని, పొన్నూరు రోడ్డులో గల ఆపరేషన్ సర్కిల్ కార్యాలయానికి నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్ తీసుకువచ్చి కార్యాల యంలో డ్యూటీకి హాజరయ్యాడు. విచారణలో 2017లో ఏపీఎస్‌పీడీసీఎల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులకు నియామకాలు జరగలేదని, అతని ఆర్డర్ నకిలీ అని ఏపీఎస్‌పీడీసీ ఎల్ కార్యాలయం వారు నిర్ధారించి, వెంటనే అతన్ని పాత గుంటూరు పోలీసులకు అప్పగించారు. అదేరోజు సాయంత్రం అప్పటి ఎస్ఈ బొడ్డు జయ భారతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి పాత గుంటూరు సీఐ బత్తుల శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. దర్యాప్తులో ప్రకాశం జిల్లా ఒంగోలులోని కార్యాలయంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్న శివరామకృష్ణ అనే అతను మేకల రవికుమార్ వద్ద కొంత నగదు తీసుకుని ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి, అతనికి నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు సృష్టించి, అందించి మోసం చేశాడని తేలింది. ఈ కేసు పూర్వాపరాలను పరిశీ లించిన గుంటూరు 6వ అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎండీ గౌస్ ఈ కేసులో మేకల రవికుమార్‌ను నిర్దోషిగా తేల్చి, అతడికి నకిలీ ఉద్యోగ నియామకపత్రాలు ఇచ్చి మోసం చేసిన శివరామకృష్ణ అనే వ్యక్తిని దోషిగా తేల్చి 2 సంవత్సరాల జైలు శిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

తమిళనాడు వాసి అనుమానాస్పద మృతి

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రానికి చెందిన నారాయణ స్వామి అనే వ్యక్తి అనుమానాస్ప స్థితిలో మృతి చెందాడు. నారాయణస్వామి ఆరు నెలల నుంచి జిన్నా టవర్ దగ్గరలో గల బాలాజీ లాడ్జి నందు అద్దెకు ఉంటూ వంట మాస్టర్ గా పనిచేస్తూ ఉన్నాడు. అతడికి మద్యం తాగే అలవాటు ఉంది. గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్నాడని లాడ్జి సిబ్బంది చెప్పారు. 23న రాత్రి 10 గంటలకు పని నుంచి వచ్చి రూమ్‌లో ఉన్నాడని, 24న ఉదయం ఎనిమిది గంటలకు రూమ్ బాయ్ చూడగా నారా యణస్వామి బాత్రూం వద్ద చనిపోయి ఉన్నాడు. లాడ్జి ఓనర్ పాతనూరు తిరుపతిశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

- ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్


నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ బుధవారం వెల్ల డించారు. డీఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాత గుంటూరు యాదవ బజార్‌కి చెందిన అల్ల శ్రీనివాసరావు కుమారుడు సాయి తేజ అలియాస్ తేజ, పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం నిండుజర్ల గ్రామానికి చెందిన తోకల వెంకటేశ్వర్లు కుమారుడు భాస్కర్ అలియాస్ ఇమామ్ కేడే అనే ఇద్దరు నిందితులు చోరీలకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 18 పాత గుంటూరులోని చెన్నం వారి వీధిలో రెండో లైన్లో కాకుమాను శివలీల అనే మహిళ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. పాత గుంటూరులోని బాలాజీ నగర్ నాలుగో లైన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లి వచ్చే సమయానికి ఇద్దరు ఆమె ఇంట్లో జొరబడి బీరువాని పగలగొట్టి అందులో ఉన్న రూ.2.40 లక్షలను దొంగిలిం చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పాత గుంటూరు పోలీసులు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద రూ.2.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ అబ్దుల్ రెహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు తెంచుకెళ్లిన అగంతకుడు

స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట 6/20లో ఓ అగంతకుడు మహిళ మెడలో గొలుసు తెంచుకెళ్లాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అరండల్‌పేట పరిధిలోని చంద్రయ్యనగర్‌కు చెందిన హైమవతి అనే మహిళ మంగళవా రం రాత్రి సుమారు 9 గంటల సమయంలో బ్రాడీపేటలోని తన చెల్లెలు ఇంటికి వచ్చి తిరిగి వెళుతుండగా బ్రాడీపేట 6/20 వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తి ఆమెను నెట్టాడు. దీంతో ఆమె కిందపడిపోగా ఆమె మెడలోని 2.5 సవర్ల గొలుసు తెంచుకొని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మేయర్, కమిషనర్లతో కలిసి కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

నిత్యం ప్రజల కోసమే ఉంటాం

- తూర్పు ఎమ్మెల్యే నసీర్
- మేయర్, కమిషనర్‌తో కలిసి మెడికల్ కిట్లు పంపిణీ

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పని చేసే వాళ్లమని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. నగరంలోని ప్రగతి నగర్‌లో బుధవారం మేయర్ కోవెలమూడి నాని, కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రగతినగర్ వాసులకు రూ.850 విలువ చేసే మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రగతి నగర్‌లో ప్రభుత్వ స్థలంలో పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని, ఇప్పటి వరకు వీటికి ఎలాంటి డాక్యుమెంట్లు లేవని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చాక జీవో నంబర్ 30 ద్వారా ఆక్రమిత ఇళ్లను క్రమబద్ధీకరణ చేపట్టామని, పేదల సొంతింటి కల సాకారం చేశామని వెల్లడించారు. ప్రగతి నగర్‌లో నూతనంగా రోడ్లు, పైపు లైన్ల నిర్మా ణం చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం రెండు సబ్బులు, నాప్ కిన్స్, హ్యాండ్ వాష్, ఫినా యిల్, ఓఆర్ఎస్‌తో కలిపి మెడికిట్లు అందజేస్తున్నామని తెలిపారు. తాము ప్రజల కోసం, ప్రజలతోనే ఉంటామని స్పష్టం చేశారు.

విద్యార్థుల్ని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి : నసీర్

గుంటూరు(విద్య): మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులను తూర్పు ఎమ్మెల్యే నసీర్ బుధవారం తన కార్యాలయంలో సత్కరించారు. నసీర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దే బాధ్యత గురువులదేనని, ఎంతో బాధ్యతగా పని చేయాలని సూచించారు.



వేడుకలలో పాల్గొన్న సీతారామయ్య హైస్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, అధ్యాపకులు

సీతారామయ్య హైస్కూల్లో ముందస్తు దసరా వేడుకలు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ముందస్తు దసరా వేడుకలను బుధవారం పాఠశాలలో నిర్వహించారు. చిన్నారులు బొమ్మల కొలువుతో అలరించారు. అమ్మవారి ఒక్కొక్క అవతారంతో విద్యార్థులు నృత్యరూపకం కళ్ళకి కట్టినట్లు ప్రదర్శించారు. పాఠశాల వైస్ ప్రెసిడెంట్ సూర్యదేవర హనుమంతరావు మాట్లాడుతూ ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యమిచ్చే పండుగ అని తెలిపారు. పాఠశాల కమిటీ సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లా డుతూ చెడు మీద మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను విజయదశమి అని పిలుస్తారని అన్నారు. విద్యార్థులు కర్రసాము, కోలాటం, బతుకమ్మ పాటలు, నృత్యాలతో అందరిని అలరించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గా శ్యామ్, ప్రైమరీ కోఆర్డినేటర్ దిల్ జహాన్, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ టి.శ్రీదేవి, ఇన్‌చార్జి కె.హరిప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అభినందనీయం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ అందిస్తూ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అభినందనీయమని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం, వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్ రిజిస్ట్రేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేరా యువ భారత్ జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ మై భారత్ పోర్టల్ ద్వారా నిర్వహిస్తున్న యంగ్ లీడర్స్ డైలాగ్ క్విజ్ పోటీల్లో జిల్లాలో దాదాపుగా 2వేల మం దికి పైగా యువత నమోదు చేసుకున్నారని తెలిపారు. నమోదు ప్రక్రియ అక్టోబరు 15 వరకు ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. అనంతరం క్విజ్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవ పథకం అధికారులు ఎం సంతోష్ కుమారి, ధాత్రి కుమారి, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి సారించాలి

గుంటూరు(విద్య): పచ్చదనం పరిశుభ్రతపై విద్యార్థినులు దృష్టి సారించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి సూచించారు. స్థానిక సాంబశివపేటలోని కళాశాలలో బుధవారం జరిగిన జాతీయ సేవాపథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ప్రిన్సిపాల్ ఉమాదేవి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ఆఫీసర్ ఎన్ మాధవీలత, జి.సుచరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు.



రూ.163 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

● 112 మందికి కారుణ్య నియామకాలు
● 108 మందికి పదోన్నతులు

● ఆంధ్రజ్యోతితో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెనీ క్రిస్టీనా

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా కత్తెర హెనీ క్రిస్టీనా బాధ్యతలు స్వీక రించి సెప్టెంబరు 25కు నాలుగేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆమె బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. జిల్లా పరిషత్ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆమె వివరించారు.

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లాలో జడ్పీ నిధుల ద్వారా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యమినిచ్చామని, ముఖ్యంగా తాగునీటి సరఫరా, మురుగు కాలువల నిర్మాణం, రైతులు పంట పొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణం, స్మశాన వాటికలకు ప్రహరీ గోడల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. జనరల్ ఫండ్స్‌తో పాటు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 163 కోట్లతో ఆయా అభివృద్ధి పనులకు వెచ్చించినట్లు తెలిపారు.

విద్యాభివృద్ధికి నిధులు కేటాయింపు..

జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. పదో తరగతి విద్యార్థుల కోసం విద్యా దీవెన పథకంలో భాగంగా రూ.61 లక్షలతో 34,747 మందికి స్టడీ మెటీరియళ్లు అందజేశామని తెలిపారు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు స్టడీ అవర్లు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయంలో విద్యా ర్థులకు పౌష్టికాహారం అందజేయడానికి ప్రతి ఏటా రూ. 54.39 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలి పారు. అందువల్లే జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణత 85 శాతం సాధించామని చెప్పారు. అలాగే జిల్లా పరిషత్ పాఠశాలల్లో 5,388 రాత్రి కాపలాదారుల పోస్టులను కేటాయించినట్లు తెలిపారు.

కారుణ్య నియామకాలకు మోక్షం..

తాను పదవి చేపట్టిన తర్వాత ఎన్నో సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు మోక్షం కల్పించానని చెప్పారు. అర్హతలను బట్టి 112 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, 108 మంది జిల్లా పరిషత్ ఉద్యోగులకు వివిధ స్థాయిల్లో పదోన్నతులు కల్పించామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జిల్లా పరిషత్‌కు రూ. వందల కోట్ల ఆస్తులు ఉన్నాయని, వాటిని అన్యాక్రాంతం చేసేందుకు చాలా మంది ప్రయ త్నం చేశారని చెప్పారు. తాను పదవిలోకి వచ్చిన తర్వాత ఆర్డీవోతో ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

జడ్పీటీసీలకు గౌరవం దక్కేలా...

చాలా సందర్భాల్లో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ సమయంలో జడ్పీటీసీలకు సరైన గౌరవం దక్కటం లేదని గుర్తించి, ఆ పరిస్థితిని నివారించేందుకు ప్రోటోకాల్ పాటించాల్సిందేనని అన్ని శాఖల అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. దాంతో పాటు నిధుల కేటాయింపులో కూడా వాళ్ళకే అధిక ప్రాధాన్యమివ్వాలని తాను స్వయంగా నిర్ణయించుకున్నట్లు హెనీ క్రిస్టీనా చెప్పారు.

● సాధారణ పంటల కంటే వీటికే 50 శాతం సబ్సిడీ
● డ్రిప్ ఇరిగేషన్, యంత్రపరికరాల పంపిణీ
● ప్రభుత్వ సాయంతో రైతులకు మరింత ఊతం



ఏనుగుపాలెంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న గణప వెంకటకోటయ్య

ఏనుగుపాలెం గ్రామానికి చెందిన గణప వెంకటకోటయ్య తన పొలంలో 2 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగు చేశాడు. సంవత్సరానికి 15 టన్నుల పంటను పండిస్తూ.. టన్నుకు రూ.70 వేల నుంచి రూ. 80 వేలు అర్జిస్తున్నాడు. అధిక లాభాలు వస్తుండటంతో మరో ఎకరంలో కూడా డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగు చేసే ఆలోచనలో ఉన్నాడు.

హార్టికల్చర్ పంటలపై రైతుల మొగ్గు

వినుకొండటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాధారణ పంటల కంటే హార్టికల్చర్ పంటలకు అధిక ఆదాయం వస్తుండడంతో రైతులు వాటిని పండించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభు త్వం కూడా సాధారణ పంటల కంటే వీటికే 50శాతం మేర సబ్సిడీలు అందిస్తుండటం, మౌలిక వసతులు, రాయితీలు కల్పిస్తూ ప్రోత్సాహాన్ని అందిస్తుండటంతో హార్టికల్చర్ పంటలు వేసేందుకు ముందుకొస్తున్నారు. పండ్లు, కూరగాయలు, స్పైసీ, ప్లాంటేషన్ క్రాప్స్, పూల మొక్కలు తదితర పంటలను రైతులు పండిస్తున్నారు. వినుకొండ మండలంలో 3565.57 ఎకరాల్లో హార్టికల్చర్ పంటలను రైతులు సాగుచేస్తుండగా... బొల్లాపల్లి మండలంలో 12,157.96 ఎకరాల్లో, నూజెండ్ల మండలంలో 2197.96 ఎకరాల్లో, శావల్యాపురం మండలంలో 486.96 ఎకరాల్లో, ఈపూరు మండలంలో 2908.85 ఎకరాల్లో మొత్తం 21,317.31 ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 1,49,376.54 ఎకరాలను సాగుచేస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి నబీరసూల్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో హార్టికల్చర్ పంటలకు సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ లభించకపోవడంతో కొంతమేరకు హార్టికల్చర్ పంటలు వేసేందుకు రైతులు వెనుకంజ వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు సబ్సిడీతో పాటు డ్రిప్ ఇరిగేషన్, యంత్రపరికరాలు అందించడంతో రైతులు హార్టికల్చర్ పంటలపై మొగ్గుచూపుతున్నారు. చిన్నతరహా నర్సరీలు, మష్రూమ్ యూనిట్లు, మినీ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ రూమ్‌లు, సోలార్ క్రాప్ డ్రయర్, తేనె పరిశ్రమ, పండ్ల తోటలు వంటి రకాలకు 50 శాతం మేరకు సబ్సిడీలు అందిస్తూ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.



సబ్సిడీపై రైతులు ఏర్పాటు చేసుకుంటున్న ఫారంపాండ్స్



వినుకొండ మండలం నడిగడ్డ, నీలగంగవరం సమీపంలో రైతులు సాగుచేస్తున్న బొప్పాయి పంట

చెరువులకు కొత్తకళ

● సీఎస్ఆర్ నిధులతో అందమైన లేక్‌లుగా అభివృద్ధి ● కాజా తూర్పు చెరువుతో శ్రీకారం ● వీటి అభివృద్ధిపై లోకేశ్ ముద్ర

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

అభివృద్ధిలో మంగళగిరి కొత్త పుంతలు తొక్కుతోంది. దశాబ్దాల తరబడి నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతానికి నారా లోకేశ్ రాకతో కొత్త కళ సంతరించుకుంది. నియోజకవర్గంలో ఉన్న చెరువులన్నింటినీ అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. నిజానికి మరే నియోజకవర్గంలో లేనన్ని చెరువులు మంగళగిరిలో ఉన్నాయి. వాటిలో కొన్ని అన్యాక్రాంతమై పేదల నివాసాలకు ఆవాసాలుగా మారాయి. వాటిని పక్కన పెడితే... ఇప్పటికీ అస్తవ్యస్తంగా ఉన్న చెరువులను గుర్తించి వాటిని అందంగా శోభాయమానంగా అభివృద్ధి చేస్తున్నారు. ముందుగా మంగళగిరి పరిసర ప్రాంతాలలో ఓ తొమ్మిది చెరువులను గుర్తించి వాటిని అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ఆరంభించారు. నిధుల సమస్య ప్రధాన అవరోధంగా మారడంతో దానిని అధిగమించేందుకు లోకేశ్ తన పరపతిని వినియోగించి ప్రసిద్ధ కంపెనీల నుంచి సీఎస్ఆర్ నిధులను తెచ్చి వాటి సాయంతో చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

తొలిగా కాజా చెరువుతో శ్రీకారం

తొలిగా కాజా చెరువును గుర్తించి దానిని అభివృద్ధి చేస్తున్నారు. కాజాలో జాతీయరహదారికి ఇరువైపులా రెండేసి చెరువులున్నాయి. వాటిలో తూర్పువైపున్న చెరువు 17.18 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీనిని సెల్‌కాన్ సంస్థ వారి సీఎస్ఆర్ నిధులు రూ. 3 కోట్లను వెచ్చించి అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులను ఎంటీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ చెరువులో పూడికతీత పనులను పూర్తిచేయడంతోపాటు దాని చుట్టూ 1.6 కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటే చెరువు చుట్టూ ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లో ఫెన్సింగ్ వేసి చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా మైదానాలను అభివృద్ధి చేస్తున్నారు. యువత కోసం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్‌కు వెలుపలివైపు పచ్చదనం పరిఢవిల్లేలా మొక్కలను నాటి వాటిమధ్య బల్లలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతానికి చెరువు అభివృద్ధి పనులు 70 శాతం వరకు పూర్తయ్యాయి. ఈ చెరువు అభివృద్ధి పనులతో కాజా గ్రామానికి ఓ సరికొత్త రూపు వచ్చింది.

మరో ఎనిమిదింటిని కూడా..

దీంతోపాటు మరో ఎనిమిది చెరువులను కూడా ఇదే తరహాలో అభివృద్ధి చేసేందుకు లోకేశ్ రంగం సిద్ధం చేశారు. కాజా జాతీయ రహదారికి పశ్చిమంగా ఉన్న మరో చెరువుతోపాటు చినకాకాని, నిడమర్రు, నవులూరు, ఆత్మకూరు, నులకపేట, పెనుమాక చెరువులను సంపూర్ణంగా అభివృద్ధి చేసి స్వచ్ఛ మంగళగిరిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.



కాజాలో అభివృద్ధి చేస్తున్న తూర్పు చెరువు



చెరువు చుట్టూ ఏర్పాటుచేస్తున్న వాకింగ్ ట్రాక్... నాటిన చెట్లు



అమరావతి : గాయత్రీ దేవిగా బాలచాముండికా అమ్మవారు



నరసరావుపేట : పాతూరు శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవాలయంలో పార్వతి అమ్మవారికి వైష్ణవి అలంకారం



పెదకాకాని : అన్నపూర్ణా దేవి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు

ఘనంగా దసరా మహోత్సవాలు

● ఆలయాల్లో అమ్మవారికి భక్తుల పూజలు

అమరావతి/నరసరావుపేట/పెదకాకాని, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం మూడో రోజు అమ్మవారు పలు ఆలయాల్లో గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. నరసరావుపేట పాతూరులోని శ్రీ గంగాపార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారికి వైష్ణవి అలంకారం చేశారు. పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ అన్నపూర్ణా దేవి అలంకారంలో శ్రీ భ్రమరాంబదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు.

సీఆర్‌డీఏ భవనం రెడీ!

(7వ పేజీ తరువాయి)

భావించింది. 6.13 ఎకరాల విస్తీర్ణంలో.. తొలుత రూ.82 కోట్ల వ్యయంతో భవనాన్ని నిర్మించేలా కేపీఏ సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారు. మధ్యలో వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 అక్టోబరులో పనులు పునః ప్రారంభించారు. కాలతీతమై నిర్మాణ వ్యయం పెరిగిపోయింది. ఇంటీరియర్స్ వర్కులు కూడా కార్పొరేట్ కార్యాలయాలను తలదన్నే విధంగా ఉండాలన్న ఆకాంక్షతో రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.160 కోట్లను మంజూరు చేసింది. దీంతో మొత్తం భవన నిర్మాణ వ్యయం రూ.240 కోట్లకు చేరింది.

ఎలివేషన్స్...అదుర్స్!

సీఆర్డీఏ భవన నిర్మాణాన్ని 3.62 ఎకరాల్లో చేపట్టారు. ముందర సుమారు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్, గ్రీనరీ పనులను చేపడుతున్నారు. భవనం ప్రవేశ ద్వారంపై అమరావతి గుర్తుగా ఇంగ్లీషు అక్షరం ఏ ప్రతిబింబించే విధంగా ప్రత్యేకంగా మెటల్ లోవర్స్ పానల్స్‌ను చాలా ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. దీంతో పాటే భవనం చుట్టూ ఎలివేషన్ కోసం మరిన్ని మెటల్ లోవర్స్ ప్యానల్స్‌ను నిలువు కడ్డీల రూపంలో చూడముచ్చటగా ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లో వీటిపై విద్యుద్దీపకాంతులు విరజిమ్మేలా ప్రత్యేక లైటింగ్ ఏర్పాట్లు చేశారు. ఇక భవనం చుట్టూ మెటల్ లోవర్స్‌కు మధ్య అడుగున్నర ఖాళీ వచ్చేలా క్యాట్వాక్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో మొక్కలను పెంచడం ద్వారా మరింత లుక్ తేనున్నారు. భవనానికి వెనుకవైపు 46వేల కిలోలీటర్ల సామర్థ్యంతో కల మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.

ఏ అంతస్తులో.. ఏముంది..?

మొత్తం భవనం జీ+7 రూపంలో టెర్రస్‌తో కూడి ఉంది. ఒక్కో అంతస్తును 33 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. గ్రౌండు ఫ్లోర్‌లో రిసెప్షన్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, బ్యాంకు, క్యాంటీన్ ప్రతిపాదించారు. మొదటి అంతస్తును పూర్తిగా సమావేశాల కోసం కేటాయించారు. ఇందు కోసం 250 సీటింగ్ సామర్థ్యంతో కూడిన ఓ సెమినార్ హాలు, 30 నుంచి 50 మంది పట్టే విధంగా నాలుగు కాన్ఫరెన్స్ హాళ్లు, ఓ డైనింగ్ హాలును నిర్మించారు. ఇక రెండో అంతస్తు నుంచి నాలుగో అంతస్తు వరకు ఉన్న మూడు ఫ్లోర్లు.. ఏపీ సీఆర్‌డీఏ కార్యకలాపాల కోసం వినియోగించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ప్రతిదానిలో 150 మంది వరకు సిబ్బంది పనిచేసేలా వర్కుస్టేషన్లు ఏర్పాటు చేశారు. బిల్డింగ్ మొత్తం ఏడు లిఫ్టులు ఏర్పాటు చేశారు. నాలుగేసి క్యాబిన్‌లు, ఫ్లోర్ ఇన్‌చార్జిగా వ్యవహరించే ఉన్నతాధికారి కోసం ప్రత్యేక చాంబర్ ఉంటుంది. మినీ మీటింగ్ హాళ్లను కూడా తీర్చిదిద్దారు. అయిదు, ఆరు ఫ్లోర్లను అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ)కి కేటాయించే అవకాశం వుంది. ఏడవ అంతస్తులో మునిసిపల్ శాఖ మంత్రి క్యాబిన్, శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, ఈఎన్‌సీ, డిజైన్ ఇంజనీరు చాంబర్లను చాలా అద్భుతంగా తీర్చిదిద్దారు. సిబ్బందికి వర్కు స్టేషన్ల వారీగా చాంబర్లు సిద్ధం చేశారు.

మా సమస్యలు పరిష్కరించండి మహాప్రభో..!

● అధికారుల చుట్టూ తిరుగుతూ రాజధాని రైతుల అగచాట్లు

గుంటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి 28 వేల మంది రైతులు 33,400 ఎకరాల భూములిచ్చారు. ప్రతిగా రిటర్నబుల్ ప్లాట్లను ప్రభుత్వం కేటాయించింది. అయితే రాజధానిలో అతికొద్దిమంది వివిధ కారణాల చేత ల్యాండ్ పూలింగ్‌కు తమ భూమిని ఇవ్వలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో భూ ములిచ్చిన రైతులకు ఈ- లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపు చేశారు. సుమారు 150 మంది రైతులకు ల్యాండ్ అక్విజేషన్ (భూ సేకరణ) జరగని భూముల్లో ప్లాట్ల కేటాయింపు చేశారు. ఈ తప్పిదం వల్ల అక్కడ ప్లాట్లు వచ్చిన రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారయింది. జరిగిన పొరపాటును సరిచేయమని రైతులు సీఆర్‌డీఏ అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ నేటికీ వారి సమస్య తీరలేదు. ల్యాండ్ అక్విజేషన్ చేయని భూమిలో ప్లాట్ల కేటాయింపు జరిగిన రైతులు వాటిని అమ్ముకోవడానికి వీలు లేకపోవటంతో అవస్థలు పడుతు న్నారు. అంతేకాకుండా అభివృద్ధి చేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. అదే విధంగా కొంత మంది రైతులకు వీధి పోట్లు ఉన్న ప్లాట్లను కేటాయించారు. వాస్తు రీత్యా వాటిని మార్చమని ఆ రైతులు కూడా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మరి కొంతమంది రైతులకు పరిష్కారం కానీ దేవాదాయ భూములలో ప్లాట్లు కేటాయించారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ ఈ సమస్యా పరిష్కా రం కాలేదు. రాజధాని అమరావతి రైతులకు పూర్తి న్యాయం చేసే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతున్నప్పటికీ అధికారులు మాత్రం తమ సమస్యలను పరిష్కరించట్లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాజధానికి భూములిచ్చిన రైతులను అనేక రకాలుగా వేధింపులకు గురి చేయడమే కాకుండా అభివృద్ధి లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ సమస్యలు పరిష్కారమవుతాయని భావించినా అడుగు ముందుకు పడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కలెక్టర్ల సమా వేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వారినుద్దేశించి మాట్లాడుతూ, ప్రజాస మస్యలను సత్వరమే పరిష్కరించేందుకు మానవీయ కోణంలో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. అయినప్పటికీ రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా వారి సమస్యలను పరిష్కరించట్లేదు.

భూసేకరణ చేయని చోట ప్లాటు కేటాయించారు

● కాటా అప్పారావు, తుళ్ళూరు రైతు



రిటర్నబుల్ ప్లాటు 2400 గజాలు ఉంది. అది రాజధానికి భూ మి ఇవ్వని (భూ సేకరణ చేయాల్సిన) ప్రదేశంలో కేటాయించారు. మార్చమని సీఆర్‌డీఏను కోరుతున్నాను. లేదా ప్లాటు కేటాయించిన ప్రదేశంలోని భూమిని ల్యాండ్ అక్విజేషన్ కింద తీసుకుంటే మార్చాల్సిన అవసరం ఉండదు. అదైనా చేయాలని సీఆర్‌డీఏ అధికారులను కోరుతున్నాను

9 సంవత్సరాలుగా తిరుగుతున్నా పట్టించుకోవట్లేదు

● లంకా సుధాకరరావు , వెంకటపాలెం గ్రామ రైతు



రాజధానికి 13 ఎకరాల 65 సెంట్ల భూమి ఇచ్చాం. నాలుగు భాగాలు రిటర్న్ ప్లాట్లు ఇచ్చారు. అవి కృష్ణాయపాలెం వెళ్ళేదారిలో డ్రైనేజీ ప్రదేశంలో ఉన్నాయి. వాటిని మార్చమని 9 సంవత్సరాల నుంచి సీఆర్‌డీఏ అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా వెంటనే స్పందించి ప్లాట్లు వేరే చోట కేటాయించాలి.

సార్లు.. సంబరం

(7వ పేజీ తరువాయి)

కేంద్రాలను ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో తదితరులు పరిశీలించారు.

నరసరావుపేటలో కర్నూలువాసులకు విడిది

కర్నూలు జిల్లా నుంచి వచ్చిన డీఎస్సీ అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు సుమారు నాలుగు వేల మంది ఆర్టీసీ బస్సుల్లో బుధవారం రాత్రి నరసరావుపేటకు చేరుకున్నారు. వీరి బస కోసం 18 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలకు సంబంధించిన వసతిగృహాల్లో వీరు వసతి పొందుతున్నారు. ఇక్కడ రాత్రి భోజనం, గురువారం ఉదయం అల్పాహారం తదితరాలను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను డీఈవో చంద్రకళ పర్యవేక్షిస్తున్నారు. ప్రతీ కేంద్రంలో ఏర్పాట్ల కోసం ఎంఈవో, హెచ్‌ఎంలను నియమించారు. గురువారం ఉదయం ఇక్కడి నుంచి వెలగపూడి సభకు బయల్దేరనున్నారు. పల్నాడు జిల్లా నుంచి నియామక పత్రాలను అందుకునేందుకు ఉపాధ్యాయులు తరలివెళ్లనున్నారు.

వలంటీర్లు సమాజాభివృద్ధికి పనిచేయాలి: వీసీ



ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న తాత్కాలిక వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజాభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని ఏఎన్‌యూ తాత్కాలిక వీసీ ఆచార్య గంగాధరరావు సూచించారు. ఏఎన్‌యూలో నేషనల్ సోషల్ సర్వీస్ (ఎన్ఎస్ఎస్) సమన్వయకర్త ఆచార్య దివ్యతేజోమూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వీసీ గంగాధరరావు మాట్లాడుతూ వలంటీర్లు గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని, సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పరిష్కారం చూపాలన్నారు. ఏఎస్ఎస్ఐఎస్‌టీ స్వచ్ఛంద సేవా సంస్థ సంచాలకులు రంగారావు మాట్లాడుతూ వలంటీర్లు స్వచ్ఛంద సంస్థల సమన్వ యంతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వలంటీర్లకు నిర్వహించిన వ్యాస రచన, డిబేట్ పోటీల్లో విజేతలకు వీసీ గంగాధరరావు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ శివరాంప్రసాద్, సమన్వయ కర్త దివ్యతేజోమూర్తి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ వీరయ్య, ఓఎస్డీ రవికుమార్ పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

వర్క్‌షాపు సిబ్బంది సమస్యలపై వినతి

మంగళగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్ వర్క్‌షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలపై రాష్ట్ర టెక్నికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాంకేతిక శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వర్క్‌షాపుల్లో పనిచేస్తున్న అటెండర్లను వారి డిజిగ్నేషన్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా మార్చాలని, ఇటీవల కాంట్రాక్ట్ నుంచి రెగ్యులర్ అయిన 22 మందికి నియామక తేదీని జీవోలో ఉన్న విధంగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ అసోసియేషన్ అధ్యక్షుడు పాషా, ఉపాధ్యక్షుడు శ్రీహరి, జోనల్ సెక్రెటరీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 102మందికి ఉద్యోగాలు



జాబ్ పొందిన అభ్యర్థులకు ఆఫర్ లెటర్‌లు అందజేస్తున్న సీఆర్‌డీఏ సోషల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసరావు

తుళ్లూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ సౌజన్యంతో బుధవారం జరిగిన జాబ్ మేళాలో 102 మందికి ఉద్యోగాలు లభించాయి. తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో జరిగిన ఈ మేళాలో మొక్సి ఐటీ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, పేటీఎం, ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌బీఐ కార్డ్స్, ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. 450కి పైగా ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్ మేళాకు 247మంది అభ్యర్థులు హాజరు కాగా 102మందికి ఉద్యోగాలు లభించాయి. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్‌ఆర్ విభాగ ప్రతినిధులతో కలసి సీఆర్‌డీఏ సామాజిక సంక్షేమ విభాగ డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు ఆఫర్ లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి అరుణకుమారి సీఆర్‌డీఏ సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్, జూనియర్ లైవ్‌లీహుడ్ స్పెషలిస్టులు క్రాంతికుమార్, నరసింహం, వెంకటేశ్వర్లు పాల్గొని జాబ్ మేళాను నిర్వహించారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి రిజిస్ట్రేషన్, ఇంటర్వ్యూల నిర్వహణ ప్రక్రియను సాఫీగా నిర్వహించారు.



ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్లతో కల్నల్ ఉదయ్ కుమార్, ప్రిన్సిపాల్ అప్పారావు

క్రమశిక్షణ, నిబద్ధతకు నిదర్శనం ఎన్‌సీసీ

● కల్నల్ ఉదయ్ కుమార్

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, నిబద్ధత, దృఢ సంకల్పానికి ఎన్‌సీసీ ప్రతీకగా నిలుస్తుందని కమాండెంట్ కల్నల్ ఏ ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 22 (ఏ) బెటాలియన్ తెనాలి వారి అనుబంధంతో ఎన్‌సీసీ కొత్త యూనిట్‌ను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమాండెంట్ కల్నల్ ఉదయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై తొలుత కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ పతాకాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జే అప్పారావుతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఎంపికైన క్యాడెట్లనుద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, డీన్ జే కిషోర్ బాబు, ఎన్‌సీసీ కేర్ టేకర్, ఏ ప్రవల్లిక, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా మార్గదర్శకుల ఎంపిక జరగాలి

● ఇన్‌చార్జ్ ఎంపీడీవో స్వామిరెడ్డి

పెదనందిపాడు, సెప్టెంబరు, 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిష్పక్షపాతంగా మార్గదర్శకులను ఎంపిక చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో స్వామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి పీ4పై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారిని మార్గదర్శకులను గుర్తించి మ్యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆన్‌లైన్లో దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు.



ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీపీవో నాగసాయికుమార్

పారిశుధ్యం, ఆరోగ్యంపై అవగాహన

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డయేరియా, ఇతర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూరల్ మండలంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని లాలుపురంలో డీపీవో నాగసాయికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల పరిధిలో అన్ని గ్రామాల్లో ప్రచార రథం తిరుగుతూ కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. అవగాహన కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రాలు, సీఆర్పీలు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు, లాలుపురం గ్రామ కార్యదర్శి సుభాని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని పలు పార్టీల నేతలు బుధవారం పట్టణంలోని బాబూ జగ్జీవన్ రామ్ కాలనీలో పర్యటించి అవగాహన కల్పించారు. అతిసార వ్యాధితో హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న వారి కుటుంబాలను పరామర్శించి ఆ ప్రాంత శానిటేషన్ పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, బీజేపీ నేత టంకసాల ఈశ్వర్‌నాయుడు, శివ, టీడీపీ నేత వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కాగా యూపీహెచ్‌సీ ప్రధాన వైద్యులు మానస మంజరి ఆ ప్రాంతంలో వైద్య బృందాన్ని పంపి సర్వే చేయించారు. అతిసార లక్షణాలతో చికిత్స తీసుకుని ఓ బాలుడు ఎయిమ్స్ నుంచి ఇంటికి వచ్చాడు. మరో వ్యక్తి వహీద్ అతిసార వ్యాధి లక్షణాలతో ఇబ్బంది పడుతుండగా ఎయిమ్స్‌కు తరలించారు. పెనుమాకకు చెందిన శారద అనే మహిళ కూడా ఎయిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతోందని ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా సీపీఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ స్థానిక నేతలు ఎయిమ్స్ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కండి: ఈవో

దుగ్గిరాల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కావాలని దుగ్గిరాల గ్రామ పంచాయతీ పిలుపునిచ్చింది. దుగ్గిరాల అయ్యప్పస్వామి ఆలయం ఎదుట ఉన్న పార్కును నందనవనంలా మార్చుకోవాలంటే, గురువారం ఉదయం 9గంటల నుంచి, జరిగే స్వచ్ఛతా హీ సేవలో పాల్గొనాలని ఈవో కె.వివేకానంద విజ్ఞప్తి చేశారు.



వీరలక్ష్మి అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు



మంగళగిరి: గాయత్రీ దేవిగా కనకదుర్గమ్మ, ధాన్యలక్ష్మిగా రాజ్యలక్ష్మి, కాశీ అన్నపూర్ణగా అఖిలాండేశ్వరీ అమ్మవారు, పెదనందిపాడులో చంద్రగంటా దేవి అలంకరణలో అమ్మవారు

జగన్మాత నమోనమః

● భక్తిశ్రద్ధలతో దసరా పూజలు



తుళ్లూరు గీతామందిరం సెంటర్‌లో అన్నపూర్ణాదేవి అంలకారంలో దుర్గామాత

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాతమంగళగిరి దుర్గానగర్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారు బుధవారం శ్రీ గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ భక్త బృందం ప్రతినిధి ఇంటూరి దుర్గాప్రసాద్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎర్రచెరువు వద్ద కాళీమాత, స్టేషన్ రోడ్డులోని శ్రీఅఖిలాండేశ్వరీ అమ్మవారు శ్రీకాశీ అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. నృసింహాలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారు, ఘాట్‌రోడ్డులో పద్మావతి అమ్మవారు ధాన్యలక్ష్మిగా, శివాలయంలో గంగా భ్రమరాంబిక అమ్మవారు దుర్గాదేవిగా, మెయిన్ బజారులో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు గజలక్ష్మీ అలంకారంలో పూజలందుకున్నారు.

● తాడేపల్లి టౌన్: తాడేపల్లి విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై వీరలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అమ్మవారికి తిరుమంజనం అలంకరణ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవ, అర్చన మంగళ శాసనాలు జరిగాయి. చిన్న జీయర్ ఆశ్రమ నిర్వాహకులు వెంకటాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంతస్వామి, వేద విద్యార్థులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం బాలత్రిపురసుందరీ దేవి అమ్మవారు స్కందమాతా దేవిగా, వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు చంద్రగంటా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పోలేరమ్మ భక్తభజన సమాజం వారు భజనలు నిర్వహించారు.

● వట్టిచెరుకూరు: మండలంలోని అనంతరవప్పాడులో గంగా భ్రమరాంబిక సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకరణ చేశారు. వట్టిచెరుకూరులోని గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలోను, లేమల్లెపాడు పోలేరమ్మ ఆలయంలో, ముట్లూరు లక్ష్మీ చెన్నకేశస్వామి ఆలయం, మల్లేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

● కాకుమాను: మండల పరిధిలోని కొండపాటూరు పోలేరమ్మ ఆలయం, అప్పాపురంలో పోలేరమ్మ ఆలయం, మండల కేంద్రమైన కాకుమాను గంగాపార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు.



కేఆర్‌కొండూరులో శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారం

● ప్రత్తిపాడు: గుంటూరు రూరల్ మండల పరిధిలోని దాసరిపాలెంలోని పంచముఖి గాయత్రి దేవాలయంలో బుధవారం అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

● తుళ్లూరు: రాజధాని అమరావతిలో అన్నపూర్ణాదేవి అలంకారం చేసి నవరాత్రుల పూజలు, హోమాలు నిర్వహించారు.

● దుగ్గిరాల: మండలంలో కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారు, దుగ్గిరాల నాగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు బుధవారం శ్రీకాశీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈమని, పేరుకలపూడి, శృంగారపురం, పెదకొండూరు, పెదపాలెం, చింతలపూడి, తుమ్మపూడి గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. కేఆర్ కొండూరులో శ్రీచండీహోమం కొనసాగించారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సుభాశ్

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ బుధవారం సాయంత్రం మంగళగిరి విచ్చేశారు. వీవర్స్ కాలనీ హైస్కూల్ వద్ద త్రిశక్తి భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపాన్ని దర్శించారు. బుధవారం అమ్మవారు కాశీ అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మంత్రి సుభాశ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సుభాశ్‌ను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు.



దుర్గాభవానీ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సుభాశ్

పంటలు నీట మునగకుండా చర్యలు చేపట్టాలి

సీపీఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి మధు



నీట మునిగిన కంద పంట, గండిని పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి మధు తదితరులు

తాడేపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల పంట పొలాలు నీట మునగకుండా సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండ, వడ్డేశ్వరం గ్రామాలలో నీట మునిగిన పంట పొలాలను స్థానిక సీపీఎం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ డ్రెయినేజీ నిర్లక్ష్యం వల్ల తాడేపల్లి మండలంలోని కొలనుకొండ, వడ్డేశ్వరం, గుండిమెడ, మెల్లెంపూడి, కుంచనపల్లి గ్రామ రైతుల పొలాలు నీట మునిగాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కుంచనపల్లి అపర్ణ అపార్టుమెంటు నుంచి ప్రాతూరు, కుంచనపల్లి మీదుగా గుండిమెడ, మెల్లెంపూడి, వడ్డేశ్వరం, కొలనుకొండ, కేఎల్‌యూ వరకు ఉన్న పంట పొలాల డ్రెయినేజీ కాలువ శుభ్రం చేయక, పూడకపోవడం వలనే పంటలు ముంపునకు గురయ్యాయన్నారు. కేఎల్‌యూ వైపు నుంచి గుండిమెడ వైపు వెళ్లే రహదారి ఎత్తు పెంచడం వల్ల పంట పొలాలు పల్లమయ్యాయన్నారు. డ్రెయిన్లు పూడుకుపోయాయని రైతులే రోడ్డుకు గండి కొట్టి వర్షపు నీటిని బయటకు పంపించేందుకు చర్యలు చేపట్టినా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. సంబంధిత అధికారులు పంట కాలువలను పూడిక తీయించి, అవసరమైన చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పల్లె కృష్ణ, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, నాగపోగు విజయరాజు, గుంపెన వెంకటేశ్వరరావు, కుంచనపల్లి రైతు మేకల వెంకటశివయ్య, వలివేటి శ్రీనివాసరావు, కొండా ఉష, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీలో ప్రాంగణ ఎంపికలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాములరెడ్డి తెలిపారు. వివిధ కళాశాలల నుంచి 37మంది విద్యార్థులు హాజరు కాగా, రాత పరీక్ష, మౌఖిక పరీక్షల ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జీనిర్మల జ్యోతి, ఫస్ట్‌సోర్స్ ల్యాబోరేటరీ సొల్యూషన్స్ ప్రతినిధులు టీ.రవీంద్ర, వి.రాజు, ఎం.ప్రశాంతి, ఎం.సుధీర్, వి.జోజిబాబు, సీహెచ్ భార్గవ్‌గోపి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి

● ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మనోజ్

పెదనందిపాడు, సెప్టెంబరు, 24 (ఆంధ్రజ్యోతి): రైతులు పకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ఏ మనోజ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని రావిపాడులో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏలు ఎన్ మోహనరావు, ఐ సునీత, ఏవో సుబ్రహ్మణ్యం, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

వరిలో పురుగుల నివారణ చర్యలు చేపట్టాలి: ఏవో

కాకుమాను, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరిలో నాము పురుగు, ఆకుచుట్టు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని రైతులు పురుగు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని కొల్లిమర్ల, కొండబాలవారిపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రాప్ బుకింగ్ గడువు ముగిసే సమయానికి ప్రతి రైతు సాగు చేసిన పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గ్రామ వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు.

వీటీజేఎంలో ఘనంగా ఎన్ఎస్ఎస్ డే

మంగళగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యర్రగుంట్ల ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ సమాజ అవసరాలు, ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో వలంటీర్లు ముందుండాలని సూచించారు. సామాజిక సేవను బాధ్యతగా నిర్వర్తించి, సమసమాజ నిర్మాణానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వి.తాతారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీతారావమ్మ

తాడికొండ (లాం) సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పురుషుల భాగస్వామ్యంతో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించేలా తల్లులు బాధ్యత తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.సీతారావమ్మ పేర్కొన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు లాం సెక్టార్ పరిధిలో లాం గ్రామంలో తల్లులు, గర్భిణులు, పురుషులు, బాలింతలకు అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో లాం సర్పంచ్ అబిదా అలీ, పంచాయతీ సెక్రటరీ అరుణ్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ శైలజ, హెల్త్‌సూపర్‌వైజర్ శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు: మండల పరిధిలోని కట్రపాడులో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నందకుమార్, సర్పంచ్ కొమ్మినేని దుర్గాప్రసాద్, సీహెచ్‌వో ప్రసాద్‌స్వామి, సూపర్‌వైజర్లు పి.అరుంధతి, జి.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జరీనా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● ప్రత్తిపాడు: బిడ్డ పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని, ముర్రుబాలు బిడ్డకు శ్రీరామ రక్ష అని సూపర్‌వైజర్ భారతి తెలిపారు. మండల పరిధిలోని పాత మల్లాయపాలెం, యనమదల గ్రామాలలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ, పీహెచ్ఎన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

● వట్టిచెరుకూరు: మండలంలోని కుర్నూతల గ్రామంలోని సచివాలయంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఎర్రాకుల గోపాలకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో కట్రపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జీ వెంకటేశ్వరరావు, డాక్టర్ ఆస్రఫ్‌లు పాల్గొన్నారు.

● కాకుమాను: మండల పరిధిలోని కొమ్మూరులో బుధవారం స్వస్థ్ నారీ శక్తి అభియాన్ జరిగింది. కార్యక్రమంలో తెలుగు రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్, ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

30 లోగా ఖరీఫ్ ఈ-పంట నమోదు చేసుకోండి

దుగ్గిరాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఖరీఫ్ పంటలను ఈ నెల 30వ తేదీలోగా 2025 ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవో ఆర్.విజయబాబు కోరారు. మండలంలోని రేవేంద్రపాడు, మోరంపూడి గ్రామాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలను వ్యవసాయాధికారులు బుధవారం పరిశీలించి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈఈ ప్రజ్ఞాన్‌బాబు, వీఏఏ బీ సాయికృష్ణ పాల్గొన్నారు.

రైతులకు పంట రుణాలు పంపిణీ

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం కాజ, చినకాకాని, ఆత్మకూరు, మంగళగిరి ప్రాంత రైతులకు పంట రుణాలు, క్యాష్ క్రెడిట్ లోన్లు పంపిణీ చేశారు. సుమారు రూ.22 లక్షల 80 వేల విలువైన చెక్కులను పీఏసీఎస్ అధ్యక్షుడు గాదె పిచ్చిరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. సొసైటీ పరిధిలోని 9 గ్రామాల రైతులు రుణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు అందె శివశంకరరరావు, వాసా వేణుకుమార్, సీఈవో రాయల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలు రైతులకు మేలు చేసేలా పనిచేయాలి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్



రాయపూడి సొసైటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

తుళ్లూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు కలిగేలా రైతు సహకార పరపతి సొసైటీలు పనిచేయాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. బుధవారం రాయపూడి సొసైటీ అధ్యక్షుడు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సొసైటీ అధ్యక్షుడిగా షేక్ చాంద్‌బాషా, డైరెక్టర్లుగా గంజి నాయుడు, చిట్టిప్రోలు శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు మూల్పూరి శ్రీనివాసరావు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పని గంటల పెంపును రద్దు చేయాలి: చిన్ని



పాతబస్టాండు సెంటరులో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక నేతలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పని గంటలను పెంచుతూ శ్రామిక వర్గాన్ని దోపిడీ చేస్తున్నాయని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ విమర్శించారు. పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ, సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి పాతబస్టాండు సెంటరులో నిరసన వ్యక్తం చేశారు. నిరసనలో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, కార్మిక సంఘాల నేతలు బాలాజీ, చెంగయ్య, నందం బ్రహ్మేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు, వుడతా శ్రీనివాసరావు, నందం చిన్నా, మల్లూరి వాసు, వల్లభాపురం నాగేశ్వరరావు, జేవీ రాఘవులు, పీ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల: రాష్ట్రంలో ఉద్యోగులు, కార్మికులు పనిచేసే సమయాన్ని 8నుంచి 10గంటలకు పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం నాయకులు వినతిపత్రం అందించారు. నాయకులు వై.స్టాలిన్, వై.బ్రహ్మేశ్వరరావు, పాములు తదితరులు మంచికలపూడిలో పంచాయతీ కార్యాలయానికి బుధవారం చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే పని గంటలను 8గంటలకు పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫ్యాక్టరీ, వ్యవసాయ కార్మికులతో కలిసి పీఎస్‌కి వినతిపత్రం అందించారు.

ఏపీఐఐసీ డైరెక్టర్ చిరంజీవికి అభినందన

మంగళగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన కనికళ్ల చిరంజీవిని స్థానిక టీడీపీ నేతలు బుధవారం కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తేలు ఫిరోజ్‌కుమార్, యర్రగుంట మణికంఠ, వుడతా మల్లేశ్వరరావు, సాయి రాధా, తేలు నాగమల్లేశ్వరరావు, శివ, కొండా రుషేంద్ర, చిల్లపల్లి ప్రదీప్‌కుమార్, పుట్టా శివ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరాంప్రసాద్‌కు ఆళ్ల వెంకట్ అభినందనలు



బుచ్చిరాంప్రసాద్‌ను అభినందిస్తున్న వెంకట్

పెదనందిపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన బుచ్చిరాంప్రసాద్‌ను ఎన్నారై టీడీపీ లాస్‌ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ల వెంకట్ బుధవారం ఆయన కార్యాలయం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషిచేయాలని కోరారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

కిట్స్ అక్షర్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రత్తిపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యనమదల వద్ద ఉన్న కిట్స్ అక్షర్‌లో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోయి సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోవాలన్నారు. సీనియర్ విద్యార్థులు, జూనియర్స్‌తో కలిసి మెలసి సోదర భావంతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, ప్రిన్సిపాల్ రామకోటయ్య విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ డిమాండ్

మంగళగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. కలరా వ్యాధి సోకి మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను బుధవారం ఆయన పరామర్శించారు. నేతాజీ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు తోడు నీటి కాలుష్యం వలన డయేరియా, కలరా బారిన పడి అనేక మంది ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు బి.వెంకటేశ్వర్లు, చెంగయ్య, ఎస్.గణేష్, షేక్ కాజా తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

● బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ రాశిగిరి వెంకటలక్ష్మి

పెదనందిపాడు, సెప్టెంబరు, 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ రాశిగిరి వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని వరగాని అంకమ్మతల్లి దేవస్థానం ప్రాంగణంలో బీజేపీ మండల పార్టీ అధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవే ధ్యేయం, సమాజమే దేవాలయం అన్న సంకల్పంతో బీజేపీ ముందుకు పోతోందన్నారు. ప్రపంచంలోనే భారదేశాన్ని అగ్రగామి దేశంగా ఉంచాలన్నదే బీజేపీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెలగా గంగాదర్, కూటమి నాయకులు తేళ్ల అనిల్, కోయ మహేష్, చెన్నుపాటి సురేంద్ర, బండారు రాంబాబు, గూడూరి ప్రభాకర్, కల్లూరి కృష్ణ, నాగేశ్వరరావు, ఐ.సురేష్, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నీటి సమస్యా.. కాల్ చేయండి

● మున్సిపల్ కార్యాలయంలో కాల్ సెంటర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తాగునీటి పైపులు ఎక్కడైన పగిలిన, లీకులు తలెత్తిన కుళాయిల్లో వచ్చే తాగునీరు రంగు మారినా, వాసన వచ్చిన టోల్ ఫ్రీ నెంబరు 1800 4256468లో తెలియజేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

తాగునీటి కలుషిత నివారణకు చర్యలు : కమిషనర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని.. కలరా, డయేరియా ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులకు బుధవారం సమావేశం నిర్వహించారు. వర్షా కాలం దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో సచివాలయ కార్యదర్శులు దీనిపై దృష్టి సారించాలన్నారు. ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మంచినీటి సేకరణ, శుభ్రత, పంపిణీ, వినియోగం అంశాలను ప్రతిరోజు పరిశీలించాలని చెప్పారు. ఈ కాలనీలలో ప్రజలకు కాచి చల్లార్చిన నీటిని తాగాలనే చైతన్యం కల్పించాలన్నారు. ఎక్కడా కూడా పైపులైన్లు లీకు కాకుండా చూడాలని, కుళాయిల్లో నీరు ఎలా వస్తుందో పరీక్షించాలని చెప్పారు. హెల్త్ ఆఫీసర్ యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ రోడ్డులో పారిశుధ్య కార్యక్రమం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయవాడ రోడ్డులో బుధవారం మున్సిపల్ సిబ్బంది స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. రహదారులమార్జిన్‌లలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు. వర్షపు నీరు కాల్వలోకి పోయేలా అడ్డు తొలగించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మొవ్వా ఏసుబాబు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రతిరోజు స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టామన్నారు. సీజన్ మారినందున జ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వ్యర్థాలను మున్సిపల్ సిబ్బందికి అందించాలని, రోడ్ల వెంట, కాల్వల్లో వేయవద్దని కోరారు.



రహదారి వెంట శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జేఎంజే కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జేఎంజే మహిళ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం నిర్వహించారు. శంకర కంటి ఆసుపత్రి సహకారంతో విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వ్యాసరచన పోటీలు, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అంశంపై పోస్టర్ పెయింటింగ్ నిర్వహించారు. విజేతలకు అధ్యాపకులు సాంబశివుడు, ప్రిన్సిపల్ శాంత బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథి సాంబశివుడు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సేవాదృక్పథాన్ని పెంపొందించేందుకు ఎన్‌ఎస్‌ఎస్ దోహదపడుతుందని, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రోజ్‌లిన్, అరుణసుజాత, జన్నమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ శాంత

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలలో ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. పట్టణంలోని పలు ఆలయాల్లో బుధవారం రాత్రి భక్తిగీతాలు, కూచిపూడి నాట్యం, నాటికలు ప్రదర్శించారు. బోసు రోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో మహిళలు భక్తి గీతాలు ఆలపించారు. లలిత సహస్రనామ పారాయణ చేశారు. ఉత్సవాల కమిటీ ఇన్‌చార్జి, పారిశ్రామికవేత్త మునగాల మోహనశ్యాం ప్రసాద్, దేసు శ్రీనివాసరావు, తాతా శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు. శివాజీ చౌక్‌లోకి కాళీ మాత ఆలయం వద్ద కల్యాణి ఆర్ట్స్ అకాడమీ బాలికలు జానపద, కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. నృత్య గురువు చల్లా బాలత్రిపురసుందరి, బాలికలను ఉత్సవ కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్, కార్యదర్శి శ్రీనివాసరావులు సత్కరించారు. దేవీచౌక్, మారీసుపేట శివాలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

27న మెగా జాబ్ మేళా

తెనాలి క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెనాలిలో ఈ నెల 27న శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి బుధవారం తెలిపారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ అధికారుల పర్యవేక్షణలో స్థానిక వీఎస్‌ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. 18-35 సంవత్సరాలు వయసు కలిగి టెన్త్, డిగ్రీ, డిప్లొమో అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. ముందుగా వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్హత పత్రాలు, ఆధార్, రెండు పాస్‌పోర్టు ఫొటోలు వెంట తెచ్చుకోవాలన్నారు.

5న హిందీ గురుపీఠ పురస్కారాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : హిందీ ప్రచార గురుపీఠ పురస్కారాలను అక్టోబరు 5న ప్రదానం చేయనున్నట్లు బోయపాటి దంపతుల గురుపీఠ పురస్కార సమితి నిర్వాహకులు బుధవారం తెలిపారు. నాజరుపేటలోని హిందీ ప్రేమీ మండలిలో బోయపాటి నాగేశ్వరరావు-సుభద్రాదేవి గురు దంపతుల వార్షిక హిందీ ప్రచార పురస్కార కార్యక్రమం జరుగుతుందన్నారు. తిరుపతి వెంకటేశ్వర విశ్వ విద్యాలయం ఆచార్యులు ప్రొఫెసర్ నారాయణ, కాకినాడ విశ్రాంత హిందీ అధ్యాపకులు షేక్ ఖాసీంబీలకు ఈ పురస్కారాలు ప్రదానం చేస్తారని చెప్పారు.

లంక గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ నిలిపివేత

తెనాలి క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరద ఉధృతి నేపథ్యంలో.. జిల్లా ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు.. కొల్లూరు, కొల్లిపర, భట్టిప్రోలు ప్రాంతాల్లోని లంక గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ చిరంజీవి బుధవారం తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ వైర్లు, స్తంభాలు దెబ్బతినకుండా.. ప్రమాదాల నివారణకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఏఐ, సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులు పట్టు సాధించాలి

ఏఎన్‌యూ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీపై పట్టు సాధించాల ని ఏఎన్‌యూ తాత్కాలిక రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్ అన్నారు. ఏఎన్‌యూ ఎంబీఏ, ఆర్కిటెక్చర్ విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెక్టార్ శివరాంప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ముమ్ముందు ఏఐ, సైబర్ సెక్యూరిటీ కీలక భూమిక పోషిస్తాయన్నారు. విద్యార్థులు ఈ అవగాహనా కార్యక్రమాన్ని సద్వినియోగించుకొని వాటిపై పట్టు సాధించాలని సూచించారు. ఏపీఎస్‌ఎస్‌డీసీ, ఐబీఎం స్కిల్ బిల్డ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన నరేంద్ర ఏఐ టూల్స్, జనరేటివ్ ఏఐ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేశ్‌కుమార్, ఆర్కిటెక్చర్ విభాగాధిపతి నిరుపమా, పార్థసారథి, ప్లేస్మెంట్ అధికారి అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న దసరా ఉత్సవాలు

● అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో బుధవారం వివిధ ఆలయాల్లో అమ్మవార్లను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. రామలింగేశ్వరస్వామి ఆలయం, రాజరాజేశ్వరి ఆలయం, కాళీమాత ఆలయం, దుర్గాదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అలంకారం గావించారు. మారీసుపేట చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో గాయత్రి మాతగా అమ్మవారిని అలంకరించారు. శ్రీవాసవీ ఆలయంలో నగరేశ్వరస్వామి రుద్రాభిషేకం, నిత్యహోమం, ఉభయ దాతల పూజలు నిర్వహించారు. లాస్య కూచిపూడి నాట్యాలయం కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో భక్తులను అలరించారు. దేవీచౌక్‌లో శ్రీదేవి నాదస్వర కళాకారులు నాదస్వర కచేరీ, తేజస్వి ప్రఖ్య బృందం నృత్య ప్రదర్శన చేశారు. మారీసుపేట శివాలయంలో జగన్నాథ వైకుంఠవాస భజన మండలి సభ్యులు వెంకటేశ్వర కల్యాణ గానమృతం కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు కాలనీలో విజయదుర్గ అమ్మవారికి మహిళలు కుంకుమార్చనలు చేశారు. గంగానమ్మపేటలోని పాత శివాలయంలో అమ్మవారికి కుంకుమపూజ, ఉభయ దాతల పూజలు ఘనంగా జరిపారు. నందివెలుగు కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమార్చన, గణపతి హోమం, చండీ హోమం, పార్వతీ కల్యాణం జరిపారు. మహాకవి కాళిదాసు హరికథా గానం, సత్యహరిశ్చంద్ర కాటిసీను, వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకం ప్రదర్శించారు. శివాజీచౌక్‌లో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుమ్మడి రమేష్, యర్రు శ్రీనివాసరావు ఉత్సవాల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



వాసవీ ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం

● పొన్నూరుటౌన్, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం పట్టణ శివారులోని జీబీసీ రోడ్డులో ఉన్న కనకదుర్గ భవాని ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. సహస్ర లింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని పార్వతీదేవి, కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలోని కాశీ విశాలాక్షమ్మ, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు, నిడుబ్రోలు రాజరాజేశ్వరి దేవి, చింతలపూడి భ్రమరాంబాదేవి ఆలయాల్లోని అమ్మవారు కాశి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



అన్నపూర్ణాదేవిగా కనకదుర్గ భవాని

● పెదకాకాని, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు బుధవారం అమ్మవారు శ్రీ గజలక్ష్మి అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయాన్ని దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున దర్శిస్తున్నారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు పర్యవేక్షిస్తున్నారు.



గజలక్ష్మి అలంకారంలో మహాలక్ష్మి

● చేబ్రోలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కూరగాయల మార్కెట్ సెంటర్‌లో బుధవారం దుర్గామాతను శాకంబరిదేవి అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి సమర్పించిన వివిధ రకాల కురగాయలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించామని నిర్వాహక కమిటీ తెలిపింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా భవానీలు ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



శాకంబరిగా దుర్గమ్మ దర్శనం

● కొల్లిపర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాలలో భాగంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. బుధవారం కొల్లిపర షిర్డి సాయిబాబా మందిరంలో కాత్యాయినీదేవి, శ్రీజనార్దనస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని అలంకరణ చేసి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొల్లిపర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలంకరించి, మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. తూములూరు, దావులూరు, అన్నవరం, హనుమాన్‌పాలెం, వల్లభాపురం, మున్నంగి, చివలూరు గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో పండితులు అలంకరించి, పూజలు నిర్వహించారు.



జనార్దనస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

యోగా శిక్షణ ప్రారంభం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : గంగానమ్మపేటలోని చుండూరువారి సత్రంలో బాల బాలికలకు యోగా శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. దసరా సెలవులు పురస్కరించుకుని తల్లులకు శ్రీఆంజనేయ ధ్యాన యోగా మండలి ఆధ్వర్యంలో శిక్షణను కిషోర్ గురూజీ అందిస్తున్నారు. చిన్న పిల్లలకు దసరా గుర్తు చేస్తూ పప్పు, బెల్లం, బొమ్మలను బి.సూర్యనారాయణ పంపిణీ చేశారు.

లెప్రా సొసైటీకి హెల్త్ చాంపియన్ అవార్డు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థ లెప్రా సొసైటీకి ఈస్ట్ ఆసియా పబ్లిక్ హెల్త్ చాంపియన్ అవార్డు లభించిందని ప్రాజెక్టు అసోసియేటివ్ ఏపీ బాషా తెలిపారు. కుష్టు వ్యాధికి సేవలు అందిస్తున్న సొసైటీని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందని, ఈ అవార్డుతో సంస్థ సేవలపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నిక

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. రెవెన్యూ మేనేజర్ రాంప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఉమాశంకరరావు, ఉపాధ్యక్షులుగా ఎం.సాంబశివరావు, టీవీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సూసన్, కోశాధికారిగా బాబాతాజుద్దీన్, సంయుక్త కార్యదర్శులుగా జోసఫ్, వాణిశ్రీ ఎన్నికైనట్లు తెలిపారు.

వరిలో పోటాష్ ఎరువులు తప్పనిసరి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): వరిలో తెగుళ్ల నివారణకు పోటాష్ ఎరువు వినియోగం తప్పనిసరి అని వ్యవసాయ విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్ అన్నారు. నిడుబ్రోలు, పొన్నూరు ప్రాంతాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆకు ముడత పురుగు ఉధృతి నివారణ చర్యలు, పోటాష్, యూరియా వినియోగాన్ని వివరించారు. ఈ-పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు షేక్ రేష్మ, ఎస్.సురేష్ బాబు, విస్తరణ అధికారిని దివ్యశ్రీ, సొసైటీ చైర్మన్ రాధాకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

చేబ్రోలు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు , వడ్లమూడి రైతు సేవా కేంద్రాల్లో బుధవారం పొలం పిలుస్తుంది నిర్వహించారు. వ్యవసాయ అధికారి ప్రియదర్శిని రైతులు ఈ-పంట నమోదుతోపాటు క్రాప్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. కౌలు రైతు కార్డుల ప్రాముఖ్యత, వరిలో వచ్చే తెగుళ్ల నివారణ పై రైతులకు అవగాహన కల్పించారు. పంటలో రైతులు యూరియా తక్కువగా, మిశ్రమ ఎరువులను ఎక్కువగా వాడాలని సూచించారు.

పేదలకు చీరల పంపిణీ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సాయిమంగా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రామలింగేశ్వరపేటలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ 400 మంది మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సొసైటీ సామాజిక సేవలు అభినందనీయమన్నారు. బీసీ సంఘ నాయకులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కె.రమేష్‌కుమార్, కార్యదర్శి సుధాకర్, రామకృష్ణారెడ్డి, ఉమాశంకర్, మార్కండేయులు, ప్రసాద్, రఘునాథ్ పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

ఇద్దరు యాచకుల మృతి

తెనాలి క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలోని వేర్వేరు ప్రాంతాలలో బుధవారం ఇద్దరు యాచకులు మృతి చెందినట్లు త్రీ టౌన్ పోలీసులు గుర్తించారు. బాలాజీరావుపేట నుంచి రైల్వేస్టేషన్‌కి వెళ్లే మార్గంలో 70 ఏళ్ల వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందగా.. మరో వృద్ధుడు రైల్వే స్టేషన్ ముందు రోడ్డులో మృతి చెందినట్లు గుర్తించారు. ఈ రెండు మృతి సంఘటనలపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన

కొల్లిపర, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంలో భాగంగా రైతు సాధికార సంస్థ, ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో విధాన రూపకల్పన నిపుణుల బృందం బుధవారం మండలంలోని దావులూరిపాలెం, బొమ్మువానిపాలెం గ్రామాల్లో పర్యటించింది. ఏటీఎం, ఏ గ్రేడ్, సూర్యమండలం, బయో రిసోర్స్ సెంటర్లను సందర్శించి.. బీజామృతం, ద్రవ, ఘన జీవామృతాల తయారి విధానాలను ప్రత్యక్షంగా బృంద సభ్యులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ వెంకటేష్, డీఎం సూర్యకుమార్, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సత్యన్నారాయణ, సంజీవ్ గుప్తా పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న విధాన రూపకల్పన నిపుణుల బృందం

జగనన్న కాలనీల్లో రోడ్లు వేయించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి భావన్నారాయణ

కొల్లిపర, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో రోడ్లు వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎన్. భావన్నారాయణ అన్నారు. బుధవారం కొల్లిపర శివారు గుడిబండివారిపాలెం జగనన్న కాలనీని సీపీఎం నాయకులు పరిశీలించారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించక పోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు నివాసితులు తెలిపారు. భావన్నారాయణ మాట్లాడుతూ జగనన్నకాలనీల్లో రోడ్లు వేయించాలన్నారు. సీపీఎం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో వర్షపు, మురుగునీరు బయటకు పోవటానికి అధికారులు వెంటనే తగిన చర్యలు చేపట్టాలన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెదకాకాని, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తక్షణమే పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మండల పరిధిలోని అగతవరప్పాడు గ్రామపంచాయతీలో పని చేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి పయ్యావుల మీనాక్షికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో సంవత్సరం నుంచి సబ్బులు, నూనె, యూనిఫామ్, గ్లౌజులు, మాస్కులు ఇవ్వలేదని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. పి.మీనాక్షి స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి రాజా రమేష్, ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

● కొల్లిపర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెట్టుబడుల దారుల ప్రయోజనాల కోసం కార్మికుల శ్రమను కూటమి దోపిడీ చేయడానికి ప్రయత్నం చేస్తుందని సీఐటీయూ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి విమర్శించారు. కొల్లిపరలో శాసనసభ ఆమోదించిన పని గంటల పెంపు చట్టాన్ని వ్యతిరేకిస్తూ పంచాయతీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బిల్లు ప్రవేశపెడితే వ్యతిరేకించాల్సిన వైసీపీ వాకౌట్ చేయడం ఎవరి కోసమని ప్రశ్నించారు. సీపీఎం జిల్లా నాయకుడు భావన్నారాయణ, కార్మిక సంఘ నాయకులు జి.సుందరరావు, పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఏఐఎస్‌ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ఏఎన్‌యూ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున యూనివర్సిటీ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. నాగార్జున యూనివర్సిటీ కమిటీ నూతన ప్రధాన కార్యదర్శిగా ఎర్రగుంట్ల అఖిల్, అధ్యక్షుడిగా పందిళ్ల కృష్ణ ఆంజనేయులు ఎన్నికయ్యారు. మహిళా కన్వీనర్‌గా పూర్ణ, ఉపాధ్యక్షులుగా గణేశ్, జాన్ సైదా, సహాయ కార్యదర్శిగా వర ప్రసాద్, కోశాధికారిగా వెంకటేశ్ నాయక్ బాధ్యతలు చేపట్టారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

'పీఎం స్వానిధి'తో వీధి వ్యాపారులకు రుణాలు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పీఎం స్వానిధితో వీధి వ్యాపారులను ప్రోత్సహించేందుకు రుణాలు మంజూరు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు తెలిపారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం లోకకల్యాణ మేళ కార్యక్రమంపై సమీక్ష జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ మెప్మా ఎండీ ఆదేశాల మేరకు అక్టోబరు 2వ తేదీ వరకు లోక కల్యాణ మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. వీధి విక్రయదారుల నమోదు, ఐడీ కార్డుల జారీ, నూతన మంజూరుపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆహార పదార్థాల శుభ్రతపై వ్యాపారాలకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. పీఎం స్వానిధి రుణాలను తిరిగి చెల్లించాలని చెప్పారు. కార్మిక శాఖ వీధి వ్యాపారుల పథకాల గురించి తెలిపారు. మెప్మా కార్యాలయంలో పీఎం స్వానిధి పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సీహెచ్ ఉమామహేశ్వరి కార్మిక శాఖ అధికారిని కె.అనిత, ఎల్‌హెచ్ జై కుమార్, సీఎంఎం శ్యామల, పలు బ్యాంకు మేనేజర్లు, పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో దీర్ఘకాలిక రోగాల గుర్తింపు : ఎంపీపీ

కొల్లిపర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెడికల్ క్యాంపుల ద్వారా దీర్ఘకాలిక రోగాలను గుర్తించటానికి అవకాశం ఉందని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. బుధవారం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎంపీపీ పద్మావతి, ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాలకృష్ణ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రంగారావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ మహిళలు గ్రామాల్లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను సద్వినియోగించుకోవాలన్నారు. డాక్టర్ రంగారావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కువ మందికి బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నట్లు తెలిపారు. మహిళల ఆరోగ్యం మెరుగు పర్చడానికి ప్రభుత్వం స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. సీడీపీవో విజయగౌరి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహారం స్టాల్స్‌ను మెడికల్ అధికారులు, ప్రజాప్రతినిదులు పరిశీలించారు. మెడికల్ క్యాంపులో 200 మంది మహిళలకు వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు మెడికల్ క్యాంపులో పాల్గొని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు అడపా నారాయణరెడ్డి, ఆరిమండ రామిరెడ్డి, మండ్రు మురళి, మునగాల కృష్ణమూర్తి, రెడ్డి శివపార్వతి, అశ్వనీకుమార్ పాల్గొన్నారు.



మెడికల్ క్యాంపులో రక్తదానం కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ పద్మావతి, మెడికల్ అధికారులు

రైతులకు అన్ని సేవలు అందిస్తాం

● నిడుబ్రోలు సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు అందిస్తామని నిడుబ్రోలు సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు రాధాకృష్ణమూర్తి అన్నారు. నిడుబ్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా నల్లమోతు రాధాకృష్ణ మూర్తి, సభ్యులుగా వడ్రాణం వెంకటసుబ్బారావు, కత్తుల శివ నాగమల్లేశ్వరి ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక రైతులు నూతన కార్యవర్గ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. నల్లమోతు రాధాకృష్ణ మాట్లాడుతూ రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు అందించడంలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ బాబు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నల్లమోతు రాధాకృష్ణ

లంక గ్రామాలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

కొల్లిపర, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి 4,50,326 క్యూసెక్కుల పైగా నీటిని కృష్ణానది దిగువకు విడుదల చేయడంతో వరద ఉధృతి మరింత పెరిగింది. దీంతో రేవుల్లోకి ఎవరూ వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్‌తో కలిసి బుధవారం బొమ్మువానిపాలెం, అన్నవరంలంకల్లోని రేవులను సందర్శించారు. వరద ఉధృతిని పరిశీలించారు. గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశించారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాలకృష్ణ

ప్రజాసేవ భావన ప్రతి అధికారిలో ఉండాలి

కొల్లిపర, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేయాలనే భావన ప్రతి ఒక్క అధికారిలో ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పీ 4 మార్గదర్శకులు-బంగారు కుటుంబాలు శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్ అధ్యక్షత వహించారు. గోపాకృష్ణ మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులతో కలరా, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, అధికారులు తగిన జాగ్రత్తగా ఉండాలన్నారు. పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీపీ భీమవరపు పద్మావతి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సేవ పథకం ఆవిర్భావ దినోత్సవం

చేబ్రోలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సుచరిత మాట్లాడుతూ సమాజానికి అందించే సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ కె.సుధాకర్, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.